# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఆగష్టు 2026

వెల : రూ. 10.00



## జూన్ 1 నుండి జులై 6 వరకు
## శ్రీ మాతాజీవారి అమెరికా యాత్ర దృశ్యములు



శ్రీ చల్లా రాంప్రసాదు, ఉమాదేవి వారి నివాసంలో



శ్రీ కిషోర్, దీపిక వారి నివాసమందు



శ్రీ కోటి, లక్ష్మి వారి నివాసమందు



ఆదిపరాశక్తి మరియు సాయి మందిరం, పోర్ట్‌లాండ్

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 12
పేజీలు 44
ఆగస్ట్ 2026

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ............................... ....... పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ ................. 7
మాతా అన్నపూర్ణ............................................. 9
భగవద్గీత సాధన దీపిక ...............................11
రామస్యదూతమసక్యన్నమామి.................14
విద్యాపతి ......................... ......................... ...................16
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్‌వారి సహస్ర నామావళిః ......... 17
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ! 19
నారద భక్తి సూత్రములు ................ ..............21
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....23
మానవుని అజ్ఞానానికి ఈశ్వరుని నవ్వు............................24
మాయా విలాసం............................ ..................26
పాదసేవనం ................ ..................................28
నిరీక్షణ .....................................................................31
శ్రీ గురుగీత ........................................... ........33
గురుకృప ........................................ .............35
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37
పూరి - కామాఖ్య యాత్ర............................39
విష్ణు కథలు ....... ........................... ...................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్



15. ఓంకృష్ణ ఓంకృష్ణ కృష్ణాయ నమః
యనుచ యే కార్యము జేసినను
దోషములన్నియును హరియించు
కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥

తా: తన పరమభక్తులైన గోపికలకు శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన దివ్య మంత్రం **'ఓంకృష్ణ ఓంకృష్ణ కృష్ణాయ నమః శ్యామసుందర మదనమోహన కృష్ణాయ నమః హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణాయ నమః॥'** ఈ మంత్రాన్ని సర్వకాల సర్వావస్థలయందు జపిస్తూ వుంటే ఆ మానవుడు చేసే పనులలో ఎటువంటి దోషాలు ఉన్నా, అవన్నీ ఆ నామస్మరణలోనే హరించిపోతాయి. ఉదాహరణకు వంకాయలు తరుగుతూ ఈ నామస్మరణ చేస్తూ ఉంటే ఒకవేళ ఆ వంకాయలో ఏ పురుగైనా ఉండి అది నీ కత్తికి బలైతే, ఆ దోషం నీకు అంటకపోగా భగవానుని నామస్మరణ వింటూ మరణించడం వలన ఆ పురుగుకి కూడా ఉత్తమజన్మ లభిస్తుంది. భగవద్గీతలో స్వామి చెప్పినట్లు నిప్పున్న ప్రతిచోటా పొగ ఆవరించినట్లు సృష్టిలోని ప్రతి కార్యమూ ఏదో ఒక దోషంతో ఆవరించబడి ఉంటుంది. అయితే నిరంతర భగవన్నామ స్మరణ, కర్మఫల త్యాగము మనలను ఆ దోషాలనుండి రక్షిస్తాయి.

1) రావణుని చంద్రహాసము ఎప్పుడు తన మహిమను కోల్పోయింది?
2) చేపలు, తామరపూలు నదిలో ఎందుకు తలదాచుకున్నాయి?
3) మలవిసర్జనతో కోర్టు ఆవరణ అంతా పరిమళభరితం ఎలా అయ్యింది?
4) శ్రీ బాబూజీకి సమర్పించిన స్వీట్లు ఎందుకు బాగోలేవు?
5) జ్ఞానవంతుడివి అయ్యేదాకా పొరపాట్లు చేయకుండా ఉండాలంటే ఏమి చేయాలి?
6) శాశ్వతంగా ఆకలిని తీర్చే ప్రసాదం ఏది?
7) హృదయ పరిశుభ్రతకు అతిపెద్ద అడ్డంకులు ఏవి?
8) మనస్సుకు పోషణనిచ్చే ఆహారం ఏది?

***సమాధానాలు లోపలి పేజీలలో ............................***

## శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

9-11-1981

శ్రీబాబు ఈరోజు ఉదయం వాకింగ్‌కి వచ్చారు. శ్రీ బాబు మాట్లాడుతూ 'పవిత్రమైన కార్తీకమాసంలో లింగోద్భవకాలంలో లేచి ఆ పరమేశ్వరుడిని అభిషేకిస్తే ఎంతో మంచిది. కానీ మీరు నిదురలేవరు. తెల్లవారినా నిదురపోతారు. భక్తునికి నిదుర ఉండదు. సోమరితనం ఉండదు. మనస్సుకు ఏకాగ్రత కుదిరితే చిత్తము ఎక్కడిది? అన్నది ప్రశ్న. కర్మబీజం అన్నది జవాబు. ఏమాత్రం బీజం మిగిలినా జన్మ తప్పదు. భక్తుల జీవిత చరిత్రలు మనస్సులో నిలిచిపోవాలి. భక్తులపేర్లు మనస్సులో నిలవాలిగాని సినిమాయాక్టర్ల పేర్లు కాదు. భక్తుల చరిత్రలలో మధ్య మధ్య ఎన్నో దుస్సంఘటనలు వస్తాయి. చూశారా! మాయాశక్తి ఎంత విచిత్రమైనదో? అంతటి భక్తులే మాయకి గురిఅవక తప్పలేదు. చూడండి క్షేత్రంలో ఏ విధమైన బీజములూ మనకి కనబడవు. క్షేత్రము శుద్ధి చెందినది అని మనము భావిస్తాము. కానీ వర్షము పడగానే క్షేత్రము అంతర్భాగములోనున్న బీజము మొలకెత్తుతుంది. అలాగే కర్మబీజము ఎంతమాత్రము మిగిలినా అది అనేక సంకల్పాలకి గురిచేస్తుంది. పాలలోనే పాలు కలుస్తాయి కానీ పాలలో ఇంకేమీ కలవవు. అందుచేతనే పరమాత్ముడు భక్తులలో మిగిలియున్న కర్మబీజాలని ఏదో సంఘటన ద్వారా హరిస్తాడు. అది ఆయనకే తెలుస్తుందిగానీ ఇంకెవ్వరికీ తెలియదు. అంతటి భక్తులకే విషయాదులపైకి మనస్సు చలించినపుడు కోన్ కిస్కా గొట్టంగాళ్ళం, మనమెంత?



మనస్సు ఎప్పుడు ఏ విధంగా పరమాత్మవైపు మళ్ళుతుందో అది మన పూర్వ జన్మ సంస్కారముపైన ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకి మన ఇంట్లో భూగర్భంలో నిధి ఉందనుకోండి. అది మనకి తెలుస్తుందా? కానీ కొంతకాలం తిరగగా తిరగగా అది ఎప్పటికైనా బయటపడవచ్చు. అది బయట పడినప్పుడే అది మనకి తెలుస్తుంది. అదే జన్మ సంస్కారము అంటే. అలాగే నీలో ఉన్న జ్ఞానమాణిక్యాన్ని వెదికిపట్టుకో. నీలో జ్ఞాన మాణిక్యం ఉందని తెలుసుకుంటే చాలు. దానిని పట్టుకోగలుగుతావు. నేను ఎప్పటికో అప్పటికి భగవంతుడిని చేరతానులే అనుకోకూడదు. ఎప్పటికైనా సాధన ద్వారానే తరించగల్గుతాడు మానవుడు' అన్నారు శ్రీ బాబు.

శ్రీ బాబూజీ అందరికీ స్వీట్స్ పెట్టారు. స్వీట్స్ ఎలా ఉన్నాయి. "ఛీ! యివి బాగాలేవు. ఈ స్వీట్స్ ఇచ్చినవారి హృదయంలో ఏవో కలుషభావాలు ఉన్నాయి" అన్నారు శ్రీ బాబు. ఇంతలో కోదండరామయ్యగారు బిళ్ళలు తెచ్చి భక్తులందరికి ఇచ్చారు. శ్రీ బాబు మాట్లాడుతూ 'ఇవి చూడండి ఎంత తియ్యగా ఉన్నవో! ఆయన మంచి భక్తులు' అన్నారు. రాజుగారి మనవరాలికి తీర్థం ఇస్తూ 'చేపలు తినటానికి పెద్ద నోరు తెరుస్తావు తీర్థానికైతే తెరవవు' అన్నారు శ్రీ బాబు. శ్రీ బాబూజీ స్వీట్‌మీద కాగితం ఊడదీస్తూ 'చూశారా ఈ కాగితం స్వీటుకి ఎలా అతుక్కుని ఉందో అలా మీ మనస్సు భగవానునికి అతుక్కుంటే చాలు' అన్నారు.

డాక్టరు కృష్ణార్జునరావుగారి స్నేహితుడు బాబూజీ దర్శనార్థం వచ్చారు. ఆయన క్రిందనే ఉన్నారు. వాకింగ్‌లో పాల్గొనలేదు. వాకింగ్ అయిన తర్వాత డాక్టరుగారు తన స్నేహితుని విషయం ప్రస్తావించినపుడు, శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'మీ స్నేహితుడు వాకింగ్‌కి రాలేదుగా. ఆయనకి కావలసింది నా దర్శనమే. క్రింద నిలబడి మనము వాకింగ్ చేస్తుంటే దర్శనము చేసుకున్నాడు కదా! ఆయన కోర్కె తీరింది కదా! ఈ ప్రసాదం ఆయనకి కూడా యివ్వండి' అని స్వీట్స్ యిచ్చారు.

శ్రీ బాబూజీ దర్శనార్థం ఇంకొక వ్యక్తి వచ్చాడు. ఆయన బాగా చదువుకున్నవాడు. ఆయనకి పొడవైన గడ్డం ఉంది. ఆయన క్రింద నిలబడి అక్కడనే ఉన్న ఒక లారీవంక చూస్తున్నాడు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'ఏమిటి ఆ లారీవంక చూస్తున్నావు. దాంట్లో ఏమి ఉంది? అసలు వస్తువు ఆత్మని దర్శించాలిగాని' అన్నారు. శ్రీ బాబూజీయే తిరిగి 'ఆత్మ ఎక్కడ ఉందండీ!' అని ప్రశ్నించారు. 'ఆత్మ సర్వ వ్యాపకమైనది' అని ఆ వ్యక్తి చెప్పాడు. 'మరి మీరు ఇందాకటినుంచి చూసే ఆ లారీలో కూడా ఆత్మ వస్తువు వుండదాండీ?' అని శ్రీ బాబూజీ ప్రశ్నించేసరికి, ఆవ్యక్తి నవ్వి ఆ విషయాన్ని తప్పించి తాను ఆశ్రమానికి ఎప్పుడు వచ్చింది, తనని ఇక్కడికి వెళ్ళమని ఎవరు చెప్పింది వివరించాడు.

గుంటూరులో డాక్టరు శంకరరావుగారు 'శ్రీ బాబూజీ, కృష్ణుడు, రాముడు వంటి అవతార పురుషులు కాబట్టి ఆయనని ఆశ్రయించండి' అని చెప్పినట్లు శ్రీ బాబూజీతో చెప్పారు. 'డాక్టరుగారు చెప్పింది ఈయన నమ్మేశాడు' అని అన్నారు శ్రీ బాబూజీ. ఆ వ్యక్తి నమస్కరించాడు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ 'డాక్టరుగారు చెప్పింది గుడ్డిగా నమ్మటం ఎందుకు? అది నీ అనుభవపూర్వకంగా తెలుసుకో' అన్నారు.

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

# మనసుకు ఆహారం గురుబోధ

"ఈ జగత్తు సర్వం మూడుతోనే ముడిపడి వుంది. మనని బంధిస్తున్న సత్వ, రజ, స్తమో గుణములు, ఈషణత్రయములు, జాగ్రత్, స్వప్న సుషుప్త్యవస్థలు యిత్యాది త్రిపుటిని రహితం చేసుకోవడానికి కావలసిన మూడు సాధనాలు - శ్రవణము, మననము, నిదిధ్యాస. అట్టి త్రిపుటిని రహితం చేసేది దివ్యజ్ఞాన బోధ. మన శరీరపోషణకి ఆహారం తినడం ఎంత ముఖ్యమో, మన మనస్సుకి పోషణనిచ్చే ఆహారమైన దివ్యబోధామృతాన్ని శ్రవణం చేయడం కూడా అంతే ముఖ్యం. అట్టి బోధ, యిటువంటి సత్సంగ సమావేశాలలో పుష్కలంగా లభిస్తుంది.



మనం అఖండంగా పూజలు చేయవచ్చు. పారాయణలు చేయవచ్చు - తీర్థ ప్రసాదాలు సేవించవచ్చు. కానీ, మనం చేసే పూజలోని అర్థాన్ని పరిపూర్ణంగా, తత్వపూరితంగా తెలుసుకోవాలంటే, బోధ కావాలి. మనం ఏ పని చేస్తున్నా, సర్వకాల సర్వావస్థలయందు మనలోనే వుండి, సాక్షిగా చూస్తున్న ఏకైక సత్యవస్తువుని గుర్తించాలి. అదే నిజమైన పూజ. తమలోనూ, సర్వత్రా వున్న ఆ సత్యవస్తువును నిరంతరం గుర్తించే మహాత్ములు ఎల్లప్పుడూ ఆనందంగా వుంటారు.

నవరంధ్రాలతో కూడిన ఈ మానవ శరీరానికి శక్తినిచ్చేది, ఆ లోపల వున్న చైతన్యమే. ఈ సత్యముని తెలుసుకోవడమే 'నవరాత్రి' వుత్సవములు జరుపుకోడంలోని సార్థకత. నేను చేస్తున్నాను అని విర్రవీగుతాడు మానవుడు. కానీ చేయించేదంతా ఆ జగజ్జనని యొక్క శక్తి.

అమ్మవారు ఎందరెందరో రాక్షసులని సంహరించిందని పురాణాలు చెప్తున్నాయి. లోతుకు వెళ్ళి తరచి చూస్తే మనని బాధించే సత్వ రజస్తమో గుణములు, ఈర్ష్యాసూయాదులు, కామక్రోధాది గుణములనే రాక్షసులని సంహరించి మనకి శాంతిని, ఆనందాన్ని

ప్రసాదిస్తుంది ఆ జగన్మాత. కానీ, అశాశ్వతమైన విషయ వాంఛలను వీడి, శాశ్వత వస్తువైన ఆ జగన్మాతని పరిపూర్ణ విశ్వాసంతో ఆశ్రయించాలి. మనలోని త్రిపుటి రహితం కావాలంటే ఆ త్రిపురసుందరిని ఆశ్రయించి, ఆరాధించాలి.

సత్వ, రజస్తమో గుణములనే మూడు మూకుళ్ళు, మనలోని జ్ఞానజ్యోతిని కప్పివేశాయి. వాటిని భగవన్నామం, ధ్యానం, విశ్వాసంతో బ్రద్దలు కొట్టాలి. అలాగని అవి మూడూ వేరువేరని అనుకోకండి. విశ్వాసంతో చేసిన భగవన్నామమే ధ్యానం. గుణరహితమయితేనే గురుదర్శనం అవుతుంది. కనుక త్రిగుణరహితం చేసే ఆ త్రిపుర సుందరిని, మనసా, వాచా, కర్మణా సేవించి సత్య, శివ, సుందర స్వరూపాన్ని పొందండి.

అటువంటి శక్తిని ప్రసాదించే గురుపాదుకలు అఖండైశ్వర్య భోగ భాగ్యములను, సుఖశాంతులను, అఖండ భక్తి, జ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి సర్వులనూ కాపాడుగాక!"

**సముద్రంలోని పెద్ద పెద్ద అలలను తట్టుకొని, భద్రంగా ఒడ్డుకు చేరడంలో దిక్సూచి నౌకకు సాయపడుతుంది. అలాగే సంసారమనే సాగరాన్ని తరించి, ఆవలి ఒడ్డుకు చేరుకోవాలంటే, దిక్సూచి ఎప్పుడూ ఉత్తర దిక్కునే సూచిస్తున్నట్లుగా మన మనస్సు ఎప్పుడూ భగవంతుని మీదే నిలచి వుండాలి.**

\- శ్రీ కాళీబాబు

భీమవరం శాఖలో 12-8-26 బుధవారం నుండి 16-8-26 ఆదివారం వరకు పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు, శ్రీ శ్రీనివాస రామానుజదాసుగారి ప్రవచనములు జరుగును.

# మాతా అన్నపూర్ణ
- సన్నిధానం కాళీమాత

అన్నపూర్ణమాతని తలచుకోగానే, మనకు స్ఫురించేది మన ఆహార రూపమైన అన్నమును అమ్మవారిగా స్మరించుకోవడం అని. జీవులకు భౌతికమైన ఆకలిబాధను తీర్చే అమ్మగానే కాక, జన్మపరంపరను దూరం చేయగల జగజ్జననిగా మనకు పురాణముల ద్వారా తెలుస్తోంది. వండిన తరువాత 4గం.ల కంటే ఎక్కువ నిల్వ వుండని పదార్థముగా కాని, తిన్నాక తృప్తిని ఇచ్చినా గాని, 4గం.లలో మళ్ళీ కావాలనిపించే ఆహార పదార్థములు గానే కాక, అన్నపూర్ణ తత్వం అత్యంత నిగూఢమైనది.

అన్నపూర్ణ శబ్దంలో వుండే పూర్ణ అనే శబ్దానికి వున్న అర్థం మన ఋషులు చెప్పిన '**పూర్ణమదః పూర్ణమిదం.....**' ప్రకారం అర్థం తీసుకుంటే, అమ్మ చేతిలో వుండే నిండైన ప్రసాదముంచిన పాత్ర ఏదైతే వున్నదో అది ఎప్పుడూ పూర్ణంగానే వుంటుంది. అందులో నుంచి ఎంతమందికి ప్రసాదం పంచినా, ఆ పాత్ర పూర్ణంగానే వుంటుంది. ప్రసాదం స్వీకరించి వారు పూర్ణ స్వరూపులుగా మారుతారు. మనం ప్రార్థనా శ్లోకంలో చెప్పుకునే పద్యం '**అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే, జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం, భిక్షాం మే దేహి పార్వతి।**

అన్నపూర్ణే సదాపూర్ణే అంటే అటువంటి సదా పూర్ణత్వం కలిగినది అని అర్థం. శంకర ప్రాణవల్లభే అనగా శంకరుని శుద్ధ జ్ఞానం తాను సంపూర్ణంగా కలిగి వుండటం చేత, భక్తులకు కూడా అదే జ్ఞానం ఇవ్వగలిగినది. అటువంటి జ్ఞానమును పొందుటకు అవసరమైన వైరాగ్యమును, జ్ఞానమును భిక్షగా మనకు ఇచ్చే తల్లి. అనగా మనం తీసుకునే అన్నం, పూర్ణతత్వం కలిగిన ప్రసాదం, మనకు భౌతిక శరీరానికి సంబంధించిన ఆకలిబాధను తీర్చే తాత్కాలికమైన ప్రయోజనమును చేకూర్చునదేగాక, శుద్ధ జ్ఞాన స్వరూపమైన శివతత్త్వ జ్ఞానమును తెలియపరచగల ప్రయోజనమును చేకూర్చునదిగా గ్రహించగలగాలి. మరి అన్నపూర్ణ తత్వం కలిగిన ప్రసాదం ఎలా లభిస్తుంది మనకు అంటే సద్గురుదేవులు మనకు ఇచ్చే ప్రసాదం అదే!

మన ఆకలి బాధను తీర్చుకోవడం కోసం మనం అనేక చోట్ల ఆహారం తీసుకుంటూ వుంటాము. చాలా ఖరీదైన హొటల్లో కూడా

అత్యంత రుచికరమైన పదార్థాలను భుజించవచ్చు. అవి తాత్కాలికమైన ఆకలిని తీరుస్తాయి. మళ్ళీ 3, 4 గం.లలో తిరిగి ఆకలి వేస్తుంది. సద్గురు దేవులు ప్రసాదించే పూర్ణతత్వం కలిగిన ప్రసాదం తాత్కాలిక ఆకలి బాధను తీర్చడమేకాక, జీవునిలో వైరాగ్యం, జ్ఞానమనే బీజాలు నాటుకునేలా చేస్తాయి. అవి శరీరానికి అవసరమైన ఆకలి మళ్ళీ పుట్టకపోవటమనే  లక్షణము కాక, మళ్ళీ శరీరం లేకుండా చేయగలవు. అనగా మళ్ళీ జన్మలు లేకుండా ముక్తిని ప్రసాదించగలవు. అందుకే సద్గురువులు పెట్టే ప్రసాదం, రుచికరమైన తాత్కాలిక ఆకలిబాధలు తీర్చే ఆహారముతో పోల్చుకోరాదు. మళ్ళీ జన్మలు రాకుండా చేయగలిగే పూర్ణతత్వం కలిగినదిగా గుర్తించాలి.

అదే విధంగా మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారం కూడా మాతా అన్నపూర్ణ ప్రార్థనా శ్లోకంతో, అదే భావనతో తీసుకోవడం వలన, మన సాధారణ భోజనం కూడా అన్నపూర్ణ మాత అనుగ్రహంతో మనకు వైరాగ్యము, జ్ఞానములను ఇచ్చి, జన్మ పరంపరల నుండి రక్షించి, ముక్తిని ఇస్తుంది. కానీ రుచిగా వున్నదని ఎక్కువగా తీసుకోవడం, అరుచిగా వున్నదని నిర్లక్ష్యం చేయడం వలన దుష్పరిణామాలకు లోను కావల్సి వుంటుంది. అన్నమును పరబ్రహ్మ స్వరూపంగా భావించమని మన పెద్దలు చెబుతారు.

అనారోగ్య పరిస్థితి వలన కాని, అనివార్య కారణాలవలన కాని ఆహారం తీసుకోని పరిస్థితులలో శ్రీ మాతా అన్నపూర్ణా స్తోత్రం శ్రీ శంకరాచార్యులు రచించిన అన్నపూర్ణాష్టకం పారాయణ మంచి ఫలితాలను ఇవ్వటం ఎందరికో అనుభవంలో వున్న విషయమే **'భక్తాభీష్టకరీ సదాశుభకరీ, కాశీపురాధీశ్వరీ'** అయిన అన్నపూర్ణ భుక్తిముక్తి ప్రదాయిని.

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

**19. య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఈ ఆత్మను చంపేవాడుగా భావించటం కానీ, లేదా చంపబడేదిగా భావించటం కానీ కేవలం అజ్ఞానం. ఈ ఆత్మ చంపేది కానీ చచ్చేది కానీ కాదు" అన్నాడు.



"జీవులందరూ శివ స్వరూపులే అయితే, సర్వమూ బ్రహ్మమే అయితే, అదే సత్యం అయితే, మరి నాకు ఆ విధంగా ఎందుకు కనిపించటంలేదు? నేను జగత్తును బ్రహ్మముగా ఎందుకు గ్రహించలేకపోతున్నాను? అని నీకు అనుమానం కలగటం సహజం. దీనికి కారణం అజ్ఞానం, లేదా అవిద్య. ప్రతివాడు నేను సూర్యుడు ఉదయించటం చూస్తున్నాను అంటాడు. నిజానికి భూమి గుండ్రంగా ఉండి తన చుట్టూ తాను తిరుగుతున్నందు వలన సూర్యుడు ఉదయిస్తున్నట్లు అందరికీ అనిపిస్తుంది తప్ప వాస్తవానికి సూర్యుడు ఉదయించటం అంటూ లేదు కదా. అధ్యారోపవాదంలోని రజ్జు - సర్పభ్రాంతి ఉదాహరణనే తీసుకో. అధిష్ఠానంలో సర్పం లేకపోయినా, ఏ విధంగా అధిష్ఠానంపైన ఆరోపితమైన సర్పం నిజమైన సర్పంగా కనిపిస్తుందో, అదేవిధంగా సచ్చిదానందము పైన ఆరోపితమైన ఈ దృశ్యమానమైన జగత్తు అంతా నిజమైనదిగా అనిపిస్తున్నది. అందువలననే నీవు దానిని నిజమైనది అనుకుంటున్నావు. ఇదే బ్రహ్మలీల. నీలోని అవిద్యను, అజ్ఞానాన్ని తొలగించుకుంటే అప్పుడు నీకు సత్యదర్శనం అవుతుంది. ఈ విధంగా నీవు శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన దానిని సరిగా గ్రహించి నీ జీవితంలో అవిద్యకు, అజ్ఞానానికి ఉన్న స్థానం గుర్తించు. నీవు ఈ అజ్ఞానాన్ని జ్ఞానంతో తొలగించుకోవాలి. అప్పుడే జగత్తును గురించిన నీ భ్రమలు, తప్పుడు ఊహలు తొలగిపోతాయి. జ్ఞానం కలిగిన తరువాత నీవు జగత్తును ఈ విధంగా చూడవు. జగత్తు ద్వారా కలిగే అనుభవాలకు నీవు ప్రతిస్పందించే విధానం వేరుగా ఉంటుంది.

**20. న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః**
**అజో నిత్యశ్శాశ్వతో-యం పురాణో**
**న హన్యతే హన్యమానే శరీరే ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఈ ఆత్మకు చావు పుట్టుకలు లేవు. ఒకప్పుడు ఉండి మరొకప్పుడు లేకపోవటం అనేది లేదు. అది సనాతనము, నిత్యము, శాశ్వతము, పురాణము. శరీరం చంపబడవచ్చు గానీ, ఆత్మకు చంపబడటం అనేది లేదు" అని ఆత్మ లక్షణాలను వివరిస్తున్నాడు.

దేహి ఎప్పుడూ రాకపోకలు లేక నిలచి ఉండి, నీవు ఇంతకు ముందు వేసుకున్న వస్త్రాలను విడిచి క్రొత్త వస్త్రాలను ధరించినట్లుగా, దేహాలను విడుస్తూ, ధరిస్తూ ఉంటాడు. దానినే నీవు గిట్టటం అని, పుట్టటం అనీ అంటున్నావు. ఈ పుట్టటం, గిట్టటం అనే వాటికి సంతోషించటం, దుఃఖించటం అనేవి నీ ఆధ్యాత్మిక దృష్టిలోపం వల్ల కలుగుతున్నాయి. ఇవన్నీ బ్రహ్మలీలలు. విజ్ఞులైన వారికి ఈ సత్యం తెలుసు కనుక వారు దుఃఖించరు. అందువలన నీవు జ్ఞానవంతుడవు కా. అప్పుడు నీవు కూడా ఈ సత్యాన్ని తెలుసుకోగలుగుతావు. దానితో నీలో కూడా దుఃఖం నశిస్తుంది.

**21. వేదా వినాశినం నిత్యం య ఏన మజ మవ్యయం**
**కథం స పురుషః పార్థ! కం ఘాతయతి హన్తి కమ్? ॥**

శ్రీకృష్ణ భగవానుడు "అర్జునా! ఈ ఆత్మ జన్మలేనిది, వ్యయము, నాశనము లేనిది అని ఎవడైతే తెలుసుకుంటున్నాడో వాడు ఎవరిని చంపుతాడు? ఎవరినైనా చంపించటం మాత్రం ఎలా చేస్తాడు" అన్నాడు.

నిత్యమైన ఆత్మకు ఎన్నటికీ చావు లేదు. ఈ విధంగా ఆత్మ శాశ్వతుడు అని తెలుసుకున్నవాడే జ్ఞాని. ఒక గదిలో చీకటిగా ఉన్నప్పుడు అందులో ఏ వస్తువు ఎక్కడ ఉన్నదో తెలియదు. చీకటిలో తడుముకొనవలసి వస్తుంది. ఆ తడుముకోవటంలో దేనికైనా కొట్టుకోవచ్చు. బహుశా దేనికైనా తగిలిగానీ జారిగానీ పడటం కూడా సంభవించవచ్చు. దీనికింతటికీ కారణం చీకటి. వెలుతురు రాగానే అన్నీ సరిగ్గా కనిపిస్తాయి. అజ్ఞానం కూడ అట్లాగే ఒక రకమైన చీకటి వంటిది. నీలో ఆ చీకటి వున్నప్పుడు నీకు కళ్ళు కనబడుతూనే ఉన్నా నీ బుద్ధి మాత్రం సరిగా చూడలేదు. నీ ఆలోచనలు సరిఅయిన దారిలో పోలేవు. జన్మ, జర, మృత్యువు ఇవన్నీ భగవంతుడి లీలలు అని తెలుసుకుంటే, నీవు అజ్ఞానివలె ఎందుకు ప్రవర్తిస్తావు? దాహం తీర్చుకోవటానికి, ఒక్కసారి ఎండమావివెంట పరిగెత్తి, అది మృగతృష్ణ అని తెలుసుకున్న తరువాత నీవు మళ్ళీ ఎప్పుడైనా, ఎంత దాహం అవుతున్నా సరే, మృగతృష్ణ వెంట పడతావా? ఒక్కసారి నిప్పు ముట్టుకొని చేయి కాల్చుకున్న తరువాత మళ్ళీ నిప్పు ముట్టుకుంటావా? అలాగే ఒక్కసారి జ్ఞానోదయం అయితే, నీవు అజ్ఞానులలాగా ఎన్నడూ ప్రవర్తించవు. జ్ఞానవంతుడివి అయ్యేదాకా పొరపాట్లు చేయకుండా ఉండాలి అని నీవు అనుకుంటే, విజ్ఞులు చెప్పిన దానిని విశ్వసించి అలా ఆచరించు. నీ బుద్ధిని సన్మార్గంలో

పయనించేటట్లు చెయ్యి. తద్వారా, నీ బుద్ధిని వికసించనీ. అప్పుడే నీ మనస్సు నిర్మలంగా అవుతుంది. అలా నిర్మలము, నిస్తరంగము అయిన మనస్సుకే ఈ జగత్తు అంతా సచ్చిదానంద పరబ్రహ్మము యొక్క వివర్తము అని, అదంతా కేవలం బ్రహ్మము యొక్క నామరూపాదికము అని తెలుస్తుంది.

- సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును**

**ఆగస్ట్ 2026**

**8 శుక్ర: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**28 శుక్ర: శ్రావణ పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

**సెప్టెంబర్ 2026**

**4 శుక్ర: శ్రీ కృష్ణాష్టమి – శ్రీ సద్గురు పాదపూజ**

**6 ఆది: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ**

**14 సోమ: వినాయకచవితి – శ్రీ సద్గురు పాదపూజ**

**26 శని: భాద్రపద పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ**

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**ఆగస్ట్ 2026**

**8 శని : శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**28 శుక్ర: శ్రావణ పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**సెప్టెంబర్ 2026**

**4 శుక్ర: శ్రీ కృష్ణాష్టమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**6 ఆది: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**14 సోమ: వినాయకచవితి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**

**26 శని: భాద్రపద పూర్ణిమ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.**


# రామస్యదూతమసకృన్నమామి

- భాగవతుల హనుమత్ జయప్రద

సుందరకాండ --

సర్గ 1) మహేంద్ర పర్వతాలపై వానరసేన నిల్చొని ఉంది. వారి ముందు ఉన్న సముద్రం ఎంత విశాలమైనదంటే, దాన్ని చూసిన ప్రతి వానరుడు నిరాశతో వెనక్కి తగ్గాడు. కానీ వాయుపుత్రుడు, సంకల్పసిద్ధుడు అయిన హనుమ మాత్రం వెనక్కి తగ్గలేదు. తనలోకి తాను తొంగి చూసుకున్నాడు. తన శక్తిని తాను గుర్తుచేసుకున్నాడు.

**తతో రావణనీతాయాః సీతాయాః శత్రుకర్శనః । ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి ॥** 1 ॥ ఆ తర్వాత రావణుని చేత అపహరించబడిన సీతాదేవి జాడను వెదకడానికి, శత్రువులను సంహరించగల పరాక్రమశాలి అయిన హనుమంతుడు, చారణులు సంచరించే ఆకాశమార్గంలో బయలుదేరాడు.



అనగనగా ఒక రాజ్యానికి ఒక రాజు ఉండేవాడు. ఒక రోజు ఆ రాజసభలో రాజు ధరించే రాజముద్ర కనిపించడం లేదని తెలిసింది. అది రాజ్యాధికారానికి చిహ్నం కావడంతో మంత్రులు, సేవకులు అందరూ కూడా దానిని వెదికే పనిలో పడ్డారు. కానీ అది ఎవరికీ దొరకలేదు. అప్పుడు ఒక వృద్ధుడు రాజుతో ఇలా అన్నాడు: "మహారాజా! అందరూ చూసిన చోటే వెతుకుతున్నారు. కానీ అది ఉండే అవకాశం ఉన్న ప్రతి చోట వెతకడం లేదు." అప్పుడు రాజు ఒక యువ సైనికుణ్ణి పిలిచి ఇలా చెప్పాడు: "ఇప్పటి నుండి నీ పని ఒక్కటే --- వెతకడం. దొరికే వరకు వెతకడం" ఆ సైనికుడు గ్రామాలు, అడవులు, కొండలు, గుట్టలు అన్నీ వెతికాడు. చాలామంది అతనితో, "అది ఇక దొరకదు. సమయం వృథా చేసుకోకు. తిరిగి వెళ్ళు" అని చెప్పారు. అతడు మాత్రం ఒక మాట అన్నాడు: "వెతకడం మానేస్తే, అది నిజంగానే పోయినట్టే అవుతుంది." చివరకు ఒక నదీతీరాన ఆ రాజముద్ర దొరికింది. ఆ సైనికుడు దానిని రాజుగారికి తిరిగి ఇవ్వడానికి వెళ్లాడు. అప్పుడు రాజు అడిగాడు: "ఎంతో మంది ప్రయత్నించారు. నువ్వు మాత్రం విజయం ఎలా సాధించావు?" అని. ఆ సైనికుడు వినయంగా చెప్పాడు: "నేను రాజముద్ర కోసమే కాదు మహారాజా, నా కర్తవ్యానికి కట్టుబడి, నిబద్ధతతో వెతికాను"

హనుమంతుడు కూడా ఇదే చేశాడు. సీతాదేవి ఎక్కడ ఉందో తెలియదు. దారి ఎంత కష్టమో తెలియదు. విజయం ఖాయమో కాదో తెలియదు. అయినా వెతకడాన్ని ఆపలేదు. శ్రీరామనామామృతాన్ని హృదయంలో నింపుకొని సముద్రాన్ని

లంఘించాడు.**"ఇయేష పదమన్వేష్టుం"** అంటే కేవలం వెతకడానికి బయలుదేరాడు అనే అర్థం మాత్రమే కాదు. లక్ష్యం నెరవేరేంతవరకు తన ప్రయత్నాన్ని విడువకుండా కొనసాగించాడు అనే గొప్ప భావం కూడా ఇందులో ఉంది.

ఈ ప్రథమ శ్లోకంలోనే మనకు మూడు సత్యాలు కనిపిస్తాయి. 1. ప్రతి మనిషిలోనూ అపారమైన శక్తి దాగి ఉంటుంది. భగవత్కార్యం చేయాలనే సంకల్పం కలిగినప్పుడు, ఆ శక్తి తనంతట తానే మేల్కొంటుంది. 2. అడ్డంకి ఎంత పెద్దదైనా, భగవంతుని మీద నీకు ఉన్న విశ్వాసం అంతకంటే పెద్దదైతే, ఆ అడ్డంకి అడ్డంకే కాదు. 3.భగవంతుని కార్యం చేస్తున్నప్పుడు "నేను చేస్తున్నాను" అనే అహంకారాన్ని విడిచిపెట్టి, "భగవంతుడే చేయిస్తున్నాడు" అనే భావంతో చేస్తే ఏ కార్యమైనా సఫలం అవుతుంది. సముద్రాన్ని చూసి భయపడిన వానరులు వేరు... సముద్రాన్ని చూసి తన రూపాన్ని పెంచుకున్న హనుమంతుడు వేరు కదా! హనుమంతుని ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. ముందున్న మార్గంలో ఆయనకు ఎదురయ్యే మొదటి పరీక్ష ఏమిటి? తెలుసుకుందాం...

- సశేషం

***వ్యామోహ తరంగాలలో, సంసార సాగరంలో తల మునకలై దరిచేరే దారి కానక, చేయూత కోసం పరితపిస్తున్న తన బిడ్డలను ఆదుకొమ్మనీ, చేదుకొమ్మనీ, చేయూతనిమ్మని కరుణామయి అయిన జగన్మాత నన్నిక్కడ నిలిపింది.***

- శ్రీ బాబూజీ

**కట్టమూరు గ్రామములో 29-8-2026 నుండి 1-9-2026 వరకు పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు జరుగును.**

(గత సంచిక తరువాయి)

## విద్యాపతి

సేకరణ - మురళి

ఉగ్నా మళ్లీ తప్పించుకునే ప్రయత్నం చేశాడు., కాని విద్యాపతి "ఉగ్నా... నువ్వే స్వయంగా నా మహాశివుడవు!" అన్నాడు. విద్యాపతికి అంతా అర్థమైంది. తన ఎదుట వున్నవాడు మరెవరో కాదు, స్వయంగా భగవాన్ శంకరుడే అని గ్రహించాడు. వెంటనే ఆయన ఉగ్నా పాదాలపై పడిపోయి "త్రాహిమాం ప్రభో! త్రాహిమాం!" అని విలపించాడు। అప్పుడు ఉగ్నా తన అసలైన మహాదేవుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. ఆ దివ్యదర్శనం చూసి విద్యాపతి కళ్లలో ఆనందబాష్పాలు ఉప్పొంగాయి. మహాదేవుడు "విద్యాపతి! నీ భక్తి, నీ కవితా శైలి నన్నెంతో ఆకట్టుకున్నాయి. అందుకే ఉగ్నా అనే సేవకుడి వేషంలో నీ దగ్గరకు వచ్చాను. ఇకముందూ నీతోనే ఉండాలనుకుంటున్నాను. కానీ ఒక షరతు --- నేను మహాదేవుడినని ఎవరితోనైనా చెప్పిన క్షణం నేను అంతర్ధానం అవుతాను।" అన్నాడు. విద్యాపతి గద్గద స్వరంతో "ప్రభో! నాకు లోకంలోని ఏ సంపద అవసరం లేదు. మీ సాన్నిధ్యం చాలు. కానీ మీరు నా ఇంట్లో సేవకుడిలా ఉండటం నాకు బాధగా ఉంది।" అన్నాడు. అప్పుడు శివుడు "కాదు కుమారా! నేను ఉగ్నాగానే నీతో ఉంటాను. కానీ ఈ రహస్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ --- నీ భార్య సుశీలకైనా --- చెప్పకూడదు" అన్నాడు. విద్యాపతి అంగీకరించాడు. మహాదేవుడు మళ్ళీ ఉగ్నా రూపం ధరించాడు.

ఆ తర్వాత విద్యాపతి ఉగ్నాతో తక్కువ పని చేయించాలని ప్రయత్నించేవాడు. కానీ సుశీల ఈ రహస్యం తెలియక ఎప్పటిలాగే పనులు పురమాయించేది. ఒక రోజు సుశీల ఉగ్నాకు ఒక పని చెప్పింది. అతడు సరిగా అర్థం చేసుకోక వేరేలా చేశాడు. కోపంతో ఊగిపోయిన సుశీల నేలపై ఉన్న చీపురును తీసుకుని ఉగ్నాను కొట్టడం ప్రారంభించింది. ఉగ్నా మౌనంగా దెబ్బలు భరిస్తూ నిలబడ్డాడు. ఇంతలో అక్కడికి వచ్చిన విద్యాపతి ఆపడానికి ప్రయత్నించాడు. కానీ సుశీల వినలేదు. చివరకు భావావేశంతో "ఓ అవివేకి! నువ్వెవరిని కొడుతున్నావో తెలుసా? ఉగ్నా సాధారణ సేవకుడు కాదు --- స్వయంగా భగవాన్ శంకరుడు!" అని అరిచాడు.అంతే। ఆ మాట బయటకు వచ్చిన క్షణమే ఉగ్నా అంతర్ధానం అయ్యాడు. తన తప్పు తెలుసుకున్న విద్యాపతి తీవ్ర పశ్చాత్తాపంలో మునిగిపోయాడు. అన్నం, నీరు మానేసి "ఉగ్నా! ఉగ్నా!" అంటూ విలపించసాగాడు. పిచ్చివాడిలా తిరిగాడు. "ఓ నా ఉగ్నా! నువ్వెక్కడికి వెళ్ళిపోయావు? ఓ నా శివా! నన్ను విడిచి ఎందుకు దూరమయ్యావు? నీవు భాంగ్ లేకుంటే ఎలా అలిగిపోయేవాడివో, నేను తెచ్చి ఇస్తే ఎలా నవ్వేవాడివో నాకు గుర్తొస్తోంది. నాకైతే మూడు లోకాల రాజ్యమూ అవసరం లేదు; నాకు కావలసింది నా ఉగ్నానే!" మహాభక్తుడు, మహాకవి విద్యాపతి 1448వ సం. సమస్తిపూర్ జిల్లా, విద్యాపతి ధాంలో 95 సంవత్సరముల వయస్సులో విదేహ ముక్తులయ్యారు.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి)

-పాలూరి ప్రసాద్

**160. ఓం విశ్వ పావనాయ నమః**

శ్రీ గురుదేవులు పరమ పావన స్వరూపులు. వారితో సాన్నిహిత్యము, సంపర్కము కలిగిన ఏ వస్తువైనను తనలోని మలినాలను పోగొట్టుకొని పరమ పావనమై ప్రకాశిస్తుంది. ఈ సమస్త విశ్వమును పావనమొనర్చే శక్తి శ్రీగురుదేవులకు ఉన్నది.

**161. ఓం అక్షరాయ నమః**

శ్రీ గురుదేవులు అక్షర స్వరూపులు. అనగా నాశనము లేని వారు. ఈ సకల చరాచర సృష్టి కన్నా ఆద్యులు. ఆది అంతము లేనివారు. వారిలో నుండే ఈ సకల జగత్తు వుద్భవించినా వారి యొక్క పూర్ణత్వమునకు ఏ లోటూ లేదు. వారికి వృద్ధి క్షయములు లేవు.

**162. ఓం సాధు సంత్రాణ దక్షాయ నమః**

శ్రీ గురుదేవులు సాధువులను సంరక్షించుటలో, వారిని సంసార బంధముల నుండి ఉద్ధరించుటలో సమర్థులు. సాధకులను ఈ బాహ్య ప్రపంచములోని దుష్టులనుండి రక్షించుటలో వారు ఎంత సమర్థులో, అంతఃశత్రువులైన కామక్రోధాది గుణముల నుండి రక్షించి, ఉద్ధరించుటలో అంతే సమర్థులు.

**163. ఓం భాగవత ప్రియాయ నమః**

శ్రీ గురుదేవులు పరమ భాగవతులైన భక్తులకు అత్యంత ప్రియులు. అట్లే గురుదేవుల యెడల గాఢమైన భక్తిని కలిగి, వారి ఆజ్ఞను అక్షరాలా పాటించే ఆ భక్తులు కూడా వారికి అత్యంత ప్రీతిపాత్రులు. అట్టి భక్తుల హృదయ కమలాలలోని భక్తి మకరందాన్ని జుర్రుకోవటానికి వారు ఎల్లప్పుడు తుమ్మెదవలె వేచి ఉంటారు. జ్ఞాన సూర్యోదయము వలన వికసించిన అట్టి భక్తుల హృదయ కమలాలలోని ఆత్మానంద మకరందమును గ్రోలుటకు శ్రీగురుదేవులు తుమ్మెదయై ప్రవేశిస్తారు. ముక్తి కాంతా చంద్రోదయమై ఆ హృదయ కమలము ముకుళించుకుంటే అందులో గురు భ్రమరం శాశ్వతముగా నిలిచిపోతుంది.

**164. ఓం నిక్షిప్త మహిమాయ నమః**

శ్రీగురుదేవులు సర్వ శక్తి మంతులు, సర్వేశ్వరులు. అణిమాది అష్ట సిద్ధులు సహజముగా వారిని ఆశ్రయించికొని ఉంటాయి. కాని వారు ఎప్పుడూ వాటిని దూరంగానే ఉంచుతారు. తమ శిష్యులను విపత్తుల నుండి ఉద్ధరించవలసిన సందర్భములో ఆ మహిమలు వాటంతటవి వ్యక్తమవుతాయి గాని వారు ఎప్పుడూ వాటిని ప్రచారానికి ఉపయోగించరు.

**165. ఓం ధర్మ పక్షాయ నమః**

శ్రీ గురుదేవులు ఎల్లప్పుడూ ధర్మ పక్షాన్నే వహిస్తారు. ధర్మ స్వరూపులే శ్రీగురుదేవులు. ధర్మ రక్షణకే వారు అవతారము ధరించి వచ్చారు. అధర్మము చేత, పాపము చేత ధర్మగ్లాని కలిగినప్పుడల్లా వారు అవతరించి, లోకానికి ధర్మ ప్రబోధం చేసి అధర్మాన్ని సమూలంగా పెకలించి వేసి, ధర్మ సంస్థాపనము చేస్తారు.

**166. ఓం సర్వ జన ప్రియాయ నమః**

శ్రీగురుదేవులు సర్వ జనులకు ప్రియాన్నే కలిగిస్తారు. వారికి స్వపర భేదము లేదు. వారిని ఎంతగా విమర్శించి, వారితో శత్రుత్వం వహించిన వారికైనా ఒక్కసారి వారి దివ్య మంగళ రూపం, జగన్మోహనమైన వారి చిరు దరహాసం దర్శించిన మాత్రముననే మనస్సుకు వర్ణించలేని పరమ శాంతి కలిగి, వారికి ప్రియులుగా మారిపోతారు.

**167. ఓం భీతావన సముద్రేకాయ నమః**

ఈ సంసారమనే విష వలయములో చిక్కి, దారి తెన్ను కానక బయటపడే ఉపాయం తెలియక భయభ్రాంతులైన మానవులను చేరదీసి, వారికి ఊరట కలిగించి, తమ వాత్సల్యపూరిత దృక్కులతో వారిని స్వస్థపరచి, తమ అభయ హస్తపు నీడలో వారి భయము తొలగించి, వారిని ఉద్ధరించుటకు కంకణం కట్టుకున్న కారుణ్య మూర్తి శ్రీగురుదేవులు.

**168. ఓం గీతాధర్మ ప్రచారకాయ నమః**

ధర్మానికి, అధర్మానికి నడుమ జరిగే మహాసంగ్రామంలో ఇరుపక్షాల మధ్యన నిలచి, మమకారం కర్తవ్య విముఖుణ్ణి చేయగా అచేతనుడై నిలచిన పార్థునికి కర్తవ్య బోధ చేసే నిమిత్తమై అతనిని సాక్షిగా నిలిపి సర్వ జనులకు కర్తవ్యాన్ని బోధించిన అలనాటి ఆ గీతాచార్యులే ఈ నాటి మన గురుదేవులు. అప్పటి ఆ గీతాసారం కాలక్రమేణ జనుల వికృత ప్రవృత్తులవల్ల తన అసలు అర్థాన్ని కోల్పోయి, విపరీతార్థాలు ప్రచారం చేయబడుతున్న తరుణంలో జనులకు అసలైన గీతా తత్త్వాన్ని ప్రబోధించుటకు అవతరించిన ఆచార్య దేవులే మన సమర్థ సద్గురు దేవులు.

**169. ఓం చేతోభవ నిభాకారాయ నమః**

చేతోభవుడు అంటే మన్మథుడు. మన్మథుని పోలిన అందము గలవారు శ్రీగురుదేవులు. కాని మన్మథుని సౌందర్యము రూపసౌందర్యమే. దానికి మార్పు ఉంది. కాని శ్రీగురుదేవుల సౌందర్యము ఆత్మసౌందర్యము. దానికి మార్పుగానీ వృద్ధి క్షయములుగానీ లేవు. వారు సర్వ ప్రాణులయందు చైతన్య రూపులై ప్రకాశిస్తూ, తమయందు గాఢమైన విశ్వాసము కలిగిన భక్తులయొక్క చిత్తములను రంజింపచేసి, వారిని చిదానంద స్వరూపులుగా రూపొందించుటకై ఆకారము దాల్చి వచ్చిన ఆ పరబ్రహ్మ స్వరూపులే.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

అంతవరకు చీకట్లో శూన్యంలోకి చూస్తూ చెప్తున్న సత్యభామ అర్జునుడివైపు దృష్టి మరల్చింది. ఆమె స్వరం గద్గదమైంది. "అర్జునా! ఆ రోజు స్వామి అవకాశం ప్రసాదించినా ఆభిజాత్యం, అహంకారం, స్వాభిమానం అడ్డువచ్చి క్షమాభిక్ష కోరలేకపోయాను. ఈ రోజు వరకు అది నా హృదయంలో మాటి మాటికి శల్యంలా గుచ్చుకుంటూనే ఉన్నది. నా అహాన్ని మఱచి అప్పుడే స్వామి చరణాలపై వ్రాలి క్షమాభిక్షను అర్థించి ఉంటే, ఈనాడు ఇంత దారుణమైన బాధను అనుభవించే దాన్ని కాదు" అంటూ సత్యభామ రుక్మిణి వద్దకు నడిచి ఆమె చరణాలపై తన శిరస్సు ఆనించి "అక్కా! నన్ను క్షమించు. కృష్ణుణ్ణి ఎంతో దుఃఖపెట్టాను. అంతేకాదు, మహాసాధ్వి, సాక్షాత్తు శ్రీలక్ష్మీదేవి అవతారమైన నిన్నుకూడా తప్పు పట్టాను. నా ఆ కుకర్మ ఫలితమే ఇదంతా..." సత్యభామ దుఃఖభారంతో ఇక మాట్లాడలేకపోయింది.



'సత్యభామాదేవీ!' అర్జునుడు కరుణార్ద్ర స్వరంతో అన్నాడు. "కృష్ణుడు మానవ వ్యథలకు అతీతుడు. మీకు మీరు అపరాధినిగా భావించుకొని అవమానంగా బాధపడుతున్నారు". "అవును చెల్లీ!" అంటూ రుక్మిణి మధ్యలో అందుకొని ఆమెను అనునయించింది.

"వ్యథ బయటనుంచి రాదు అర్జునా! అది అంతరంగలో ప్రకటమౌతుంది... సరే నా విన్నపం ఒకటి ఉన్నది చెప్పమంటావా?" అన్నది సత్యభామ.

"ఆజ్ఞాపించండి దేవీ! కృష్ణుని అర్ధాంగికి ఇంత బేలతనం పనికిరాదు" అన్నాడు అర్జునుడు.

"ఒకవేళ ప్రభువు నీకు ప్రభాస క్షేత్రంలో కనిపిస్తే..."

“సత్యభామాదేవీ! ” అర్జునుడు ఆమె వాక్యం పూర్తి చేయకముందే అడ్డుకొన్నాడు. “అవును. వారు ఇక ద్వారకకు ఎన్నటికీ రారు. ఆయన దర్శన భాగ్యం ఈ కనులకు ఇక లేదు. నేను చేసిన అపరాధాలకు ఈ దేహం కళంకితం అయిపోయింది. నీవు స్వామిని కలవటం తటస్థిస్తే...” అర్జునుడూ, రుక్మిణి ఏమీ మాట్లాడలేదు.

“...స్వామి కనిపిస్తే ఆయనతో నా మాటలుగా చెప్పు అర్జునా! ‘సత్యభామ దోషి. ఆమె మీకు దుఃఖాన్ని కలిగించింది. ఆ పాపానికి ఆమెకు ఎంతటి కఠోర శిక్ష వేసినా సరే. అంతేకానీ ఆమె చేసిన అపరాధానికి కులానికి అంతటికి, నగరానికి అంతటికి శిక్ష వేయటం భావ్యమా? ఈ నగరాన్ని ఎందకు విడిచిపెట్టారు?’ ఈ మాటలు నీవు స్వామి చెవిని వేయగలిగితే ...” అంటూ సత్యభామ రుక్మిణిని కౌగిలించుకుని వెక్కివెక్కి ఏడ్చింది. రుక్మిణి కూడా సత్యభామను ఊరడిస్తూ దుఃఖించింది. అర్జునుడు శూన్యంలోనికి చూస్తూ ఉండిపోయాడు.

రాత్రి రెండవ జాము ముగింపును సూచించే ఢంకా అప్పుడే కొట్టారు. ఈ శబ్ద తరంగాలు నిశ్శబ్ద వాతావరణాన్ని భంగపరుస్తూ గాలిలో తేలివచ్చాయి. దుర్గం చుట్టూ ఉన్న కందకంలో సముద్రపు నీరు వచ్చి కందకాన్ని దాదాపు నింపివేసింది. దానినుండి వచ్చే అలల శబ్దం నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ తలుపులను మెల్లగా తడుతున్నట్లుగా వినిపిస్తోంది.

ఆ రాత్రిని పులుముకొన్న నిశ్శబ్దతను మించిన గంభీరమైన నిశ్శబ్దత కృష్ణుని ఆవాసంలో అలముకొన్నది! ప్రముఖ ద్వారాల వద్ద కొన్ని దివిటీలు వెలుగుతూ కనిపిస్తున్నాయి. అక్కడక్కడ ఇళ్లలో మిణుకు మిణుకుమనే దీపాలు కనిపించటం తప్పిస్తే ఆ నీరవ నిశీథిలో అంతటా చీకటి, నిశ్శబ్దం, ప్రశాంతత. ద్వారాల దగ్గర ఉన్న సంతరీలు నిర్జీవమైన బొమ్మల లాగ నిల్చొని ఉన్నారు. మసక వెన్నెల వారి మీద పడుతూ, వారి నీడలను వంకర టింకరగా కనిపింపజేస్తూ వాతావరణం ఏదో రహస్యాన్ని దాచినట్లు అనిపిస్తోంది.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 64: అభిమానదంభాదికం త్యాజ్యం**

తాత్పర్యము: అభిమానము, దంభము మొదలగునవి (సాధకుడు) విడిచిపెట్టవలసినవి.



ఈ సూత్రము ద్వారా నారదులు భక్తి మార్గంలో నడిచే సాధకుడు అభిమానం, దంభం, వాటితో పాటు వచ్చే గర్వం, దర్పం, కోపం, కపటం, పరనింద వంటి దోషాలను విడిచిపెట్టాలని బోధిస్తున్నారు. ఎందుకంటే ఇవి సాధకుడి హృదయాన్ని కప్పివేసి, భగవంతుని కృపను అనుభవించకుండా చేస్తాయి. ఈ సూత్రం భక్తి మార్గంలో అంతఃకరణ శుద్ధికి అత్యంత ముఖ్యమైన నియమమును తెలియజేస్తుంది. ముందు సూత్రంలో నారదులు బయట నుంచి మనస్సులోకి ప్రవేశించే విషయాల గురించి హెచ్చరించారు; ఈ సూత్రం మన లోపలే దాగి ఉండే అహంకార సంబంధమైన దోషాలను విడిచిపెట్టాలని తెలియచేస్తోంది.

భక్తి అనేది కేవలం పూజలు, జపాలు, వ్రతాలు మాత్రమే కాదు; భక్తి అంటే హృదయం భగవంతుని పట్ల మృదువుగా, వినయంగా, నిర్మలంగా మారడం. ఈ హృదయ పరిశుభ్రతకు అతిపెద్ద అడ్డంకులు అభిమానం మరియు దంభం. అభిమానం అంటే కేవలం తనను తాను గౌరవించుకోవడం కాదు. ఆరోగ్యకరమైన ఆత్మగౌరవం మనిషికి అవసరం; కానీ నారదులు ఇక్కడ హెచ్చరిస్తున్నది భక్తిని కప్పివేసే అహంకార భావం గురించి. భగవంతుని కృప వల్ల వచ్చిన శరీరం, బుద్ధి, శక్తి, ధనం, స్థానం, విద్య, పాండిత్యం, --- ఇవన్నీ తన స్వతంత్ర శక్తి వల్లనే వచ్చాయని భావించడమే అభిమానం. విజయం వచ్చినప్పుడు భగవంతుని కృపను మరచి తానే చేశాననే భావం పెరగడం, ఓటమి వచ్చినప్పుడు బాధ్యతను ఇతరులపై వేయడం కూడా అభిమానం యొక్క లక్షణాలే.

దంభం అంటే లోపల ఒకటి ఉండి బయట ఇంకొకటి చూపించడం. లోపల వినయంగా లేకుండా బయట భక్తుడిలా కనిపించాలనే కోరికయే దంభంగా మారుతుంది. ధర్మం, పూజ, దానం, జపం, ఉపవాసం మొదలైనవి అన్నీ పవిత్రమైన సాధనాలే. కానీ ఇవి భగవంతునిపై ప్రేమతో కాక, ఇతరుల ప్రశంస లేదా తన గొప్పతనం కోసం ప్రదర్శించడానికి జరిగితే, అవే దంభానికి కారణమవుతాయి. దంభం వున్న చోట భక్తి సహజత్వం వుండదు; అక్కడ ఆడంబరం వుంటుంది, కానీ ఆత్మసమర్పణ

వుండదు. ఇక్కడ ఆదికం అనే పదం చాలా ముఖ్యమైనది. నారదులు అభిమానం, దంభం మాత్రమే కాకుండా, వాటితో కలిసి వచ్చే మిగతా అంతరంగ దోషాలను కూడా సూచిస్తున్నారు. అభిమానం నుంచి దర్పం పుడుతుంది; దర్పం నుంచి ఇతరులను తక్కువగా చూడడం వస్తుంది; ఇతరులను తక్కువగా చూసినప్పుడు పరనింద వస్తుంది; తనకు గౌరవం రాకపోతే కోపం వస్తుంది; కోపం నుంచి కఠిన వాక్యం వస్తుంది. ఈ విధంగా ఒక చిన్న అహంకార విత్తనం అనేక దోషాలగా  పరిణమిస్తుంది. అందుకే దాన్ని మొదట్లోనే విడిచిపెట్టాలని నారదులు సూచిస్తున్నారు.

భగవద్గీతలో కూడా ఇదే భావం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. గీత పదమూడవ అధ్యాయంలో అమానిత్వం మరియు అదంభిత్వం ఆధ్యాత్మిక జ్ఞానానికి మొదటి లక్షణాలుగా చెప్పబడతాయి. అలాగే పదహారవ అధ్యాయంలో దంభం, దర్పం, అభిమానం, క్రోధం, కఠినత్వం, అజ్ఞానం వంటి గుణాలు ఆసురీ సంపదగా వివరింపబడ్డాయి. భక్తి మార్గంలో బయట శత్రువులకన్నా లోపల దాగి వున్న అహంకారమే పెద్ద అడ్డంకి. ఎందుకంటే బయట కనిపించే విఘ్నాలను సులభంగా గుర్తించవచ్చు; కానీ అభిమానం భక్తి రూపంలో కూడా దాగి వుండగలదు. తనకు భక్తి వుందనే గర్వం కూడా భక్తికి విఘ్నమే.

అభిమానం, దంభం త్యాగం చేయడం అంటే వ్యక్తిత్వాన్ని బలహీన పరచుకోవడం, లేక ఆత్మవిలువను తగ్గించుకోవడం కాదు. నిజమైన వినయం అంటే తన దగ్గర ఉన్న శక్తి, జ్ఞానం, సంపద, సేవ, ప్రతిభ అన్నీ భగవంతుని అనుగ్రహంగా భావించడం. అలాంటి వినయం వచ్చినప్పుడు మనిషి తన కర్తవ్యాలను మరింత శ్రద్ధగా చేస్తాడు, కానీ వాటి కీర్తిని తాను తీసుకోడు. సేవ చేస్తాడు, కానీ సేవ వల్ల గర్వం పెంచుకోడు. అతను జ్ఞానం పొందుతాడు, భక్తిని ఆచరిస్తాడు, కానీ తన భక్తిని ప్రదర్శనగా మార్చుకోడు.

ఈ సూత్రం  భక్తునికి ఒక లోతైన ఆత్మపరిశీలనను నేర్పుతూ భక్తునికి తాను బయట ఏమి చేస్తున్నాడన్న దానికంటే, లోపల ఏ భావంతో చేస్తున్నాడన్నది ముఖ్యమని గుర్తు చేస్తుంది. పూజ, జపం, సేవ వెనుక అభిమానం, దంభం ఉంటే భక్తి స్వచ్ఛత తగ్గిపోతుంది. అందుకే భక్తుడు తన సాధనలను కొనసాగిస్తూ, అహంకారాన్ని, కపట ప్రదర్శనను, గర్వాన్ని, పరనిందను విడిచిపెట్టాలి. అప్పుడు హృదయం వినయంతో నిండుతుంది; వినయం వచ్చిన చోట భక్తి సహజంగా వికసిస్తుందని ఈ సూత్రం ద్వారా నారదులు సూచిస్తున్నారు.

- సశేషం

## శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

ఆగస్ట్ 2026

8 శని: శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

11 మంగళ: మాసశివరాత్రి

12 బుధ: అమావాస్య

13 గురు: 13.08.2026 - 17.08.2026 వరకు భీమవరం శాఖ సత్సంగ సమావేశములు

15 శని: శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

21 శుక్ర: వరలక్ష్మీ వ్రతం

28 శుక్ర: శ్రావణ పూర్ణిమ - రాఖీ పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

సెప్టెంబర్ 2026

4 శుక్ర: శ్రీ కృష్ణాష్టమి - కలశస్థాపన, శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం. లకు శ్రీ సద్గురు పాదపూజ.

5 శని: శ్రీ కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవం - ఉ.11.00 గం.లకు సామూహిక శ్రీ రాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన.

6 ఆది: శ్రీ గురుదశమి - ఏకాహం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

9 బుధ: మాసశివరాత్రి

11 శుక్ర: అమావాస్య

14 సోమ: వినాయకచవితి - ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాద పూజ, సామూహిక వినాయకచవితి పూజలు, భక్త సమారాధన.

26 శని: భాద్రపద పూర్ణిమ - ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం. శ్రీ సద్గురు పాదపూజ

# మానవుని అజ్ఞానానికి ఈశ్వరుని నవ్వు

సేకరణ -బి. లక్ష్మీ లలితా కుమారి.

ఇంకాసేపట్లో చనిపోయే బిడ్డకు వైద్యం చేస్తూ వైద్యుడు 'ఏమీ కాదమ్మా! మీ అబ్బాయికి ఏమీ కాదు. నేను బ్రతికిస్తాను' అన్నప్పుడు... మరోసారి ఇద్దరు అన్నదమ్ములు భూమిని పంచుకొని, 'ఇదిగో ఇటువైపు భూమి నాది, అదిగో అటువైపు వున్నది మా తమ్మునిది' అని అన్నప్పుడు...

'వీడి తండ్రి, తాత ఇదే మాట అన్నారు పోయారు, ఇప్పుడు వీడూ ఇదే మాట అంటున్నాడు, రేపు వీడూ పోతాడు అయినా ఇది నాది అనే భ్రమలో, మాయలో, అజ్ఞానంలో బ్రతుకుతున్నాడు' అని ఈశ్వరుడు నవ్వుకుంటాడట!

నిజమే! ఏదీ శాశ్వతం కాదు. మనం, మన పిల్లలు, మనం సంపాదించుకున్న ఇళ్ళు, భూములు, మన బ్యాంక్ బ్యాలన్స్ ఇవేవీ మన వెంట రావు. ఈ విషయం మన అందరికీ తెలుసు. అయినా 'నేను, నాది' అనే మాయలోనే వుండిపోతున్నాము.

ప్రతిరోజూ తెల్లవారుతోంది. పగలు వెళ్ళిపోతోంది. రాత్రి మొదలవుతోంది. తరువాత తిరిగి మళ్ళీ పగలు ఏర్పడుతోంది. పగలు తిరగడం, రాత్రిళ్ళు నిద్రపోవడం. ఎన్నాళ్ళు ఇలా? ప్రతిరోజూ తిన్నదే తింటున్నాం, త్రాగినదే త్రాగుతున్నాం. రోజూ అదే తిండి, అదే నీరు, అదే మంచం, అదే నిద్ర అయినా ఎందుకో వీటి మీద ఆశ చావడం లేదు. దుఃఖము తొలగటం లేదు. ఏమాత్రం అర్థం కాని ఈ పగలు రాత్రి అనే ప్రయాణం ఎక్కడికి?

ఆలోచిస్తుంటే ఈ ప్రయాణం ఒక రోజు చావడం దగ్గరకు తప్ప మరోచోటికి కానేకాదని మాత్రం తెలుస్తోంది. ఇక్కడ పుట్టేదంతా ఒకనాటికి తప్పక నశించేదే అయినప్పుడు ఈ దుఃఖం దేనికి? ఈ ఆరాటం దేనికి? మనలో ఏర్పడి వున్న ఈ 'నేను, నాది, నా వారు' అనే ఈ భ్రమ అంతా మనకు ఎక్కడి నుండి వచ్చింది? ఈ జీవితమే మూన్నాళ్ళ ముచ్చట అని తెలుస్తున్నప్పటికీ మరి మనం ఎందుకు ఇలా ఆలోచిస్తున్నాము? డబ్బు సంపాదించుకోవాలి, దాన్ని భద్రంగా దాచుకోవాలి, అందరికంటే గొప్పవాళ్ళం అయిపోవాలి అని?

ఇదంతా పిచ్చికాకపోతే మరేమిటి? ఇలా మనలో మనం ప్రశ్నించుకోవాలి. ఈ శరీరం పుట్టేటప్పుడు, పెరిగేటప్పుడు, పోయేటప్పుడు ఏదయితే మార్పు అనేదే లేకుండా ఈ శరీరంలో వున్నదో అదే ఆత్మ. ఈ ఆత్మే నేను అన్న ఎఱుక కలిగిననాడు ఆత్మజ్ఞానం మనలో ఉద్భవిస్తుంది. జ్ఞానం కలిగిన తరువాత వైరాగ్యం, దాని తరువాత భక్తి. భక్తికి పరాకాష్ఠ భగవంతుని దర్శనం. చివరిగా ముక్తి.

ముక్తిని పొందడానికే దైవం మనకు మానవ జన్మ ప్రసాదించాడని తెలుసుకున్న తరువాత సాధన చేయాలి. మనం కోరుకునే జ్ఞానం, ముక్తి మరెక్కడో లేదు. మన మనస్సులోనే వుంది. మనిషి దేవుడిని కోరుకోవలసినది.......

**అనాయాసేన మరణం। వినా దైన్యేన జీవనం।**

**దేహాన్తే తవ సాయుజ్య ముక్తి। దేహిమే పరమేశ్వర॥**

అంటే - భాదలేని సుఖ మరణం, ఒకరిపై ఆధారపడని జీవితం, చనిపోయిన తరువాత నీ సాన్నిధ్యం, ఓ పరమేశ్వరా! నాకు ప్రసాదించు.

**జనన మరణ చక్రం జీవరాశులకు సహజం. ఈ సంసార బంధాలు అతి మామూలు విషయాలు. వాటిని వెన్నంటి వచ్చే బాధలు అతి సహజమైనవి. వీటి నుండి బయటపడాలంటే మనస్సుని పరమాత్మకు అర్పించాలి. ఈ అర్పణకి కర్మ, భక్తి, జ్ఞాన మార్గాలలో దేన్నో ఒకదాన్ని అనుసరించాలి. అన్నింటిలోనూ అతి సులభమైనది, శ్రేష్ఠమైనది భక్తి మార్గమే! జీవుని దేవునివైపు మరలించేది భక్తిమార్గమే. సుగమమైన భక్తి మార్గంలో జీవుని దేవునితో కలిపేవాడే సద్గురువు.**

- శ్రీ గురుదేవులు

# మాయా విలాసం

-వేలమూరి రవికుమార్

(గత సంచిక తరువాయి)

ఇంతలో అక్కడ కొలనులో వున్న గాధి మహర్షికి స్పృహ వచ్చింది. తనను తాను పరికించి చూసుకున్నాడు. చుట్టూ పరిసరాలను గమనించాడు. అంతా సవ్యంగానే వుండటం చూసి, తాను ఒక కలగన్నానని నిర్ధారించుకుని తన సూర్యారాధన పూర్తి చేసుకుని బయటకు వచ్చి తన దైనందిన కార్యక్రమాలలో మునిగిపోయాడు. కొన్ని రోజులు గడిచిపోయాయి. గాధికి మెల్లగా తన కల మరపుకు రావడం, తన సాధన, నిత్య కార్యక్రమాలలో నిమగ్నమయ్యాడు. ఇంతలో ఒకనాడు గాధికి బాగా పరిచయమున్న ఒక బ్రాహ్మణుడు గాధి ఆశ్రమానికి అతిథిగా విచ్చేశాడు. అతను ఎంతో బక్కచిక్కి వున్నాడు. గాధి అతనికి సకల పరిచర్యలూ చేసి, 'మహాత్మా! మీరు ఇలా బలహీనమైపోవడానికి గల కారణమేమిటి?' అని ప్రశ్నించాడు. అప్పుడా బ్రాహ్మణుడు 'అయ్యా! ఏమి చెప్పను? నా కర్మ వశాన నేను గవల దేశానికి వెళ్లి అక్కడ వున్న నా మిత్రుని ఇంట కొన్ని సంవత్సరాలు వుండి, రాజాశ్ర.యం పొంది, ఆ రాజుకు సకల సత్కారములు చేశాను. కాని చివరకు ఆ రాజు ఒక కిరాతకుడని తెలిసింది. ప్రాయశ్చిత్తార్థమై అక్కడ వున్న బ్రాహ్మణులు అందరూ అగ్నిలో ప్రాయోపవేశం చేశారు. నాకు మరణించేటంత మనో ధైర్యం లేక, తీర్థ యాత్రలు చేస్తూ, చాతుర్మాస దీక్షలు, ఉపవాసాలు చేస్తూ, పాప ప్రాయశ్చిత్తం చేసుకుంటూ ఇలా తిరుగుతున్నాను. దీనివలన నా శరీరం ఇలా శుష్కించిపోయింది. అంతేకానీ, మరొకటి కాదు' అన్నాడు. అని కంటజుని వృత్తాంతమంతా గాధికి తెలియజేసి, అక్కడి నుండి సెలవు తీసుకుని ఆ బ్రాహ్మణుడు వెళ్లిపోయాడు.

ఇప్పుడు గాధి ముని తనకు వచ్చిన కల గురించి ఆలోచించాడు. ఆ కల మరియు ఈ బ్రాహ్మణుడు చెప్పినది సరిగ్గా సరిపోవడంతో ఒక్కసారిగా అయోమయంలో పడిపోయాడు. తనకు కటంజుడు ఎవరో, గవల మహారాజు ఎవరో అసలు తెలియదు. అయినా అంతా తాను కలలో చూసినట్లే ఎలా జరిగింది. అసలు ఇది నిజంగా జరిగిన విషయమేనా అని తేల్చుకోవడానికి ఆ కిరాతులు వుండే గూడేనికి

వెళ్ళి విచారించి కటంజుని గురించి తాను కలలో చూసినది నిజమేనని నిర్ధారించుకున్నాడు. కీర రాజ్యానికి వెళ్ళి, పలువురిని ప్రశ్నించి, మరలా వారు తెలియజేసిన ఆ వృత్తాంతమంతా తన కలతో సరిపోల్చుకుని ఎక్కడా తేడాలేదని మరోమారు నిర్ధారించుకున్నాడు. అతని మనస్సు సమాధాన పడలేదు. తన సాధనయందు మనస్సు నిలుప లేక సతమత మయ్యాడు. దాని నుండి బయటపడటానికి శ్రీహరి గురించి తపస్సు చెయ్యటమొక్కటే మార్గమని తలచి ఆ శ్రీహరిని గురించి తపస్సు చేశాడు. అప్పుడు గాధి మునికి శ్రీహరి ప్రత్యక్షమయి 'నాయనా! అదంతా నా మాయ. నీవు కోరిన కోరిక మేరకు నా మాయను ఒకసారి నీకు బయల్పరచాను.' అని చెప్పి అంతర్ధానమయ్యాడు. ఆ క్షణాన గాధి మునికి శ్రీహరి చెప్పింది కొంతవరకూ సంతృప్తి కలిగించినా పూర్తి మనఃశాంతి లభించలేదు.

తానే కర్త, కర్మ అనే భావన మనస్సులో మెదలుతుండగా మరల ఆ బోయగుడేనికి వెళ్ళి కటంజుడు నివశించిన ప్రదేశం చూశాడు. అక్కడ వున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నాడు. తాను ఏ అనుభూతినైతే పొందాడో అదే విషయాన్ని అక్కడివారు వివరించి చెప్పేసరికి మరింత అయోమయానికి గురైంది గాధి మనస్సు. అక్కడి నుండి కీర రాజ్యానికి వెళ్ళి, ఆరు మాసాలపాటు సంపూర్ణ విచారణ చేసి మరలా తన అనుభవము (కలలో) ఆ రాజ్యపు వృత్తాంతము ఒకటేనని సరిపోల్చుకున్నాడు. ఇప్పుడు ఇంకా తన బాధ తీవ్రతరమైనది. ఇక ఈ మానసిక సంఘర్షణ తట్టుకోలేక గొంతువరకూ నీటిలో నిలబడి శ్రీహరి గురించి తీవ్ర తపస్సు చేశాడు. శ్రీహరి ప్రత్యక్ష్యమయి మరల ఏమి కావాలో కోరుకో అనగా, గాధి వినయంగా 'స్వామీ! మీరు జరిగినదంతా మీ మాయ అని చెప్పారు. కానీ, నా మనస్సు శాంతించడం లేదు. కనుక నాకు వివరంగా తెలియజేసి మనశ్శాంతిని కలిగించండి' అని వేడుకుంటూ 'స్వామీ! నాకు ఎంత ఆలోచించినా ఈ క్రింది ప్రశ్నలకు సమాధానం లభించడం లేదు. నాపై దయతో నా సందేహ నివృత్తి చేయండి' అని ప్రార్థించాడు.

- సశేషం

# పాదసేవనం

సేకరణ - కీ.శే. ఎమ్. జానకిరామ శాస్త్రి

నారయ్యతో నా అనుబంధం ఈనాటిదికాదు. దశాబ్దాలనాటిది. ఇద్దరం పక్కపక్క ఇళ్లలోనే, ఒకేసారి పుట్టాం. వాడు ఉత్తర ధ్రువం, నేను దక్షిణ ధ్రువం. నన్ను సతాయించడానికే వాడు పుట్టాడేమో! నేను చిన్నప్పటినుంచీ అన్నిట్లో ఫస్టే. వాడు ఒకటో తరగతే అయిదేళ్ళు తీసుకున్నాడు. వాళ్ల అమ్మా నాన్న చిన్నతనంలోనే పోయారు. పెద్దయ్యాక తెలిసింది, వాడికి డౌన్‌సిండ్రోం అనే వ్యాధి ఉందని. మా అమ్మానాన్న వాడికి అన్నీ అయి పెంచారు. వాళ్ళూ వెళ్ళిపోయాక పూర్తి భారం నామీదే.

ఎక్కడైనా నేను పట్టిందల్లా బంగారమే! ఏ సమస్య వచ్చినా చిటికలో పరష్కారం అయిపోయేది. నాకు వాడొక్కడితోనే తలనొప్పి. నాన్నగారు ఒట్టు వేయించుకున్నారు, కాబట్టి వాడిని భరించక తప్పదు.

ఎక్కడ పనిలో పెట్టినా ఏదీ సరిగ్గా చేయడు. వాణ్ణి విడిగా పెడితే తెలుస్తుందనుకుని, ఒక పూరిగుడిసెలో పెట్టాను. ఎలాంటి మార్పు లేదు. ఎక్కడున్నా వాడికి సంతోషమే. ఇలాంటి వ్యాధి ఉన్నవారు నలభై ఏళ్లకు మించి బతకరట. వాడు పిడిరాయిలా బానే ఉన్నాడు.

నది ఒడ్డున ఉన్న వాడి ఇంటిపక్కనే వేంకటేశ్వర, శివ ఆలయాలు ఉన్నాయి. వాడు ఎప్పుడు చూసినా అక్కడే ఉండేవాడు. ఉత్సాహంగా ఏదో సేవలో పాల్గొంటూ కనబడేవాడు.

ఒకసారి చాలా ఉత్సాహంగా "ఈ నదిలో చేపలు, తామరపూలు, ఇంతకుముందు గాల్లో ఎగిరేవట తెలుసా!" వాణ్ణి ఆటపట్టిస్తూ అన్నాను. వాడదేమీ పట్టించుకోకుండా "చేపలు, తామరపూలు ఎగిరి వెళ్ళి స్వామిని చూసి మాకూ, స్వామికీ పోలికేమిటి అనుకుని సిగ్గుపడిపోయి ఈ నదిలో తలదాచుకున్నాయట" అన్నాడు. వాడికి పిచ్చి ముదురుతోంది అనుకున్నాను. వాడి ధోరణి వాడిదే.

అలా రోజులు గడిచి 60 ఏళ్ల వాళ్ళం అయ్యాం. వాడు అలాగే ఉన్నాడు. ఎప్పుడూ గుళ్ళోనే. వాణ్ణి చూడకుండా రోజు గడవదు నాకు. నేను వాడింటికి చేరేసరికి, ఆ రోజు ఇంకా సంతోషంగా కనిపించాడు. మళ్ళీ ఏం కథ చెప్తాడో అనుకున్నా, కానీ వాడేం పలకడం లేదు. ఏదో

లోకంలో ఉన్నట్టున్నాడు. చాలాసార్లు అడిగిన తరువాత గానీ మాట్లాడ లేదు. మాట్లాడుతూ, మాట్లాడుతూ, మధ్యమధ్యలో ఆగిపోతున్నాడు. తన్మయత్వంలో ఇలా చెప్పాడు.

"స్వామి స్వయంగా ఈ కుటీరానికి వచ్చారు. ఏం చెయ్యాలో తోచలేదు. ఉపచారాలన్నీ చెప్పి చేయించుకున్నాడు. లోపలికి రమ్మని కూర్చుండబెట్టి పళ్ళెంలో కాళ్ళు పెట్టి నీళ్ళతో కడిగాను. ఆ పాదాలని వదలలేక పోయాను. చేతులు కడగరా అంటే అప్పుడు చేతులు కడిగి, తుడిచాను. ఆచమనీయం ఇచ్చాను. మళ్ళీ పాదాలను నెత్తి మీద పెట్టుకున్నాను. స్నానం చేయించరా అంటే మెల్లిగా నీళ్ళు తెస్తోంటే, ఒక ఏనుగు వచ్చి నీళ్ళు జల్లింది. ఆయన నిలువెల్లా తడిసిపోయాడు. పొడి బట్టతో తుడిచి, ధూపం వేసి, కొత్త బట్టలు ఇచ్చాను. అవి ధరించి కూర్చుంటే, మళ్ళీ పాదాలమీదకి దృష్టి మళ్ళింది. "ఎప్పుడూ పద్మపీఠం మీద నిలబడే ఉంటావు కదా, కాళ్ళు నొప్పెడతాయి, కాస్త సుగంధ తైల మర్దనం చేయనీ" అంటూ ఆ కాళ్ళకీ, పాదాలకీ, సాధ్యమైనంత సున్నితంగా మర్దనం చేయడం మొదలు పెట్టాను. నా తలమీద నీటి చుక్కలు పడితే తలెత్తి చూశాను. స్వామి కళ్ళలో నీళ్ళు! కంగారు పడ్డాను. "మొరటు వాణ్ణి, నొప్పెట్టిందా తండ్రీ?" అన్నాను. ఆయన నవ్వి నా తల మీద ముద్దు పెట్టుకుని "ఎంత పిచ్చి ప్రేమరా నీది" అన్నాడు. ఇంతలో నువ్వొచ్చావు.

నా నోట మాటలేదు. వాడు అలసిన వాడిలా నా ఒళ్ళో తలపెట్టి పడుకున్నాడు. నమస్కారం చేస్తూ గొణుగుతున్నాను. "వీడికి ఏం కావాలో వీడికే తెలియదు, వీణ్ణి కాపాడు" అంటూ. ఇంతలో వాడు కళ్ళు తేలేశాడు. వాడు చూస్తున్నవైపు చూస్తే లోకం గిర్రున తిరిగింది. పాదపూజ చేసిన పళ్ళెంలోని పూలు గాలికి ఎగిరి పోయాయి. "స్వామి పాదముద్రలు స్పష్టంగా కనిపించాయి."

## సమర్థ సద్గురు మాసపత్రిక వారి విన్నపము

ఉదార దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా సమర్థ సద్గురు తెలుగు మాసపత్రిక తెలుగు రాష్ట్రాలలోని అనేక గ్రంథాలయాలకు చేరుతూ, అనేక మంది పాఠకులకు జ్ఞానసేవ అందిస్తోంది. ఈ గ్రంథాలయ చందాలలో చాలావాటి గడువు త్వరలో ముగియనున్నందున, ఈ సేవ నిరంతరాయంగా కొనసాగేందుకు భక్తులు, పాఠకులు విరాళాలతో ముందుకు రావలసిందిగా మనవి.

అలాగే, పుట్టినరోజులు, వివాహాలు, వివాహ వార్షికోత్సవాలు, గృహప్రవేశాలు వంటి శుభ సందర్భాలలో మీ బంధుమిత్రులకు బహుమతి చందాలు (Gift Subscriptions) అందించి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచండి.

మీ సహకారం అనేక మంది పాఠకులకు జ్ఞానదీపంగా నిలుస్తుంది. ఈ సేవకు సంబంధించిన వివరాల కోసం: 8333808310.

***నావికుడు లేని నావలా, నాయకుడు లేని వర్గంలా, నాగరిక ప్రపంచంలో ఎటో కొట్టుకుపోతూ, నానాటికీ భగవంతునికి దూరం దూరంగా జరిగిపోతున్న జనులను తన అక్కున జేర్చుకొని లాలించి, అవ్యాజ ప్రేమను కురిపిస్తూ, భగవంతుని సన్నిధికి చేరే బాటలో ఒక్కొక్క అడుగు వేయిస్తూ నడిపించుకుపోయేవాడే సత్య గురువు.***

- శ్రీ బాబూజీ మహరాజ్

(గత సంచిక తరువాయి) **నిరీక్షణ** తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

తన తంత్రము ఫలించలేదను కోపంతో రావణుడు యుద్ధ భూమికి వెళ్ళి రాముని మొట్టమొదటిసారిగా నేరుగా చూచాడు. ఇద్దరూ అగ్నికణములు వెదజల్లబడు రీతిలో పోరాడారు. రాముని శరపరంపర తాకిడికి రావణుని సైన్యము, రథసారథి బలైపోయారు. ఆతని రథము చిన్నాభిన్నమగుటయేగాక, పలు పలు ఆయుధములూ పిండి పిండి చేయబడ్డాయి. తన చేతులలో చివరకు మిగిలిపోయి వున్నది, పరమేశ్వరుడు బహూకరించినదైన చంద్రహాసమనబడు కరవాలమును రావణుడు రామునిపైకి విసిరాడు. అదికూడ నిరుపయోగమైపోయింది.

నిరాయుధునిగ నిలిచిన పిరికివాడైన రావణుని జూచి రాముడు, "ఓ! లంకానగర రాజా! రథము, రథసారథి, సైన్యము, ఆయుధములు అన్నింటినీ కోల్పోయి ఒంటరిగా నిలబడ్డావు. ఈ స్థితిలో వున్న నిన్ను నేను సంహరించదలచుకోలేదు. నీకు విశ్రాంతి కావలయును. కావున ఈ దినము పోయి రేపటి దినమున రమ్ము!" అన్నాడు.

రాముని మధురమైన మాటలు రావణునికి విషములాగా చేదనిపించింది. అసుర అధిపతి రావణుడు యుద్ధభూమి నుండి ఓటమి, అవమానముల కలయికతో కూడిన మనోవ్యాకులతతో తన భవనమునకు తిరిగి వచ్చాడు.

'నా ప్రస్తుత పరిస్థితిని సీత గనుక చూచినట్లైతే తనను హేళన చేస్తుందేమో' అనుకున్న రావణుడు ఆవేదనకు లోనైన మనసుతో అంతఃపురమునకు వచ్చి, తన పూజా మందిరములోనికి వెళ్ళిపోయాడు. "ఓ భగవంతుడా! తపోఫలముచే నాకు దక్కిన ఆయుధములన్నియూ వృధా అయిపోయాయి. నీవు బహూకరించిన కరవాలము కూడ నిరుపయోగమైపోయింది. ఆ కరవాలముతో ఎంతటివారినైననూ ఎదుర్కొనవచ్చునను నీ మాట అసత్యమైపోయింది కదా!" అని తనలో తాను అనుకున్నాడు.

ఆ సమయమున ఆకాశవాణి ఇలా మాట్లాడింది: "యధార్థంగా, పరమేశ్వరుడు నీకు ఇచ్చిన చంద్రహాసముచే ఒక విరోధిని మాత్రమే

సంహరించగలవను నియమమును మరచిపోయితివా? ఎప్పుడైతే నీవు ఈ కరవాలముచే ఒక అబలను కాపాడవలయునను మంచి మనసుతో నీతో పోరిడిన జటాయును సంహరించావో అప్పుడే ఈ చంద్రహాసము తన మహిమకు కోల్పోయింది."

మరునటి దినము ప్రాతః కాలమందు గాఢనిద్రలో మునిగియుండు తన తమ్ముడైన కుంభకర్ణుని లేపి, తన వద్దకు తీసుకుని రమ్మని సేవకులకు ఆజ్ఞాపించాడు. కడు తీవ్రముగ ప్రయత్నించిన మేరకు వారు కుంభకర్ణుని నిద్రనుండి మేల్కొలపగలిగి అన్నగారి ఆనను విన్నవించారు. అన్న రావణుని వద్దకు వచ్చిన కుంభకర్ణుడు, "నన్నెందులకు నిద్రనుండి లేపారు? ఏమి విపరీతం జరిగిపోయింది ఇప్పుడు?" అని ప్రశ్నించాడు.

"తమ్ముడా! నీ భుజబలమును ప్రదర్శించు సమయము ఆసన్న మయింది. నీవు తక్షణమే యుద్ధభూమికి వెళ్ళి ఆ మానవ కీటకములను నాశనం గావించి విజయముతో తిరిగి రావలయును!"

"అన్నా! సీతను కపటముతో అపహరించి తీసుకుని వచ్చుట మహా తప్పని నేను ముందుగనే మిమ్ము హెచ్చరించాను. దాని పరిణామమే ఇప్పుడు మన కులమంతటికీ శాపముగ దాపురించింది."

"కుంభకర్ణా! న్యాయ అన్యాయములను గూర్చి చర్చించు కొనుటకు ఇది తగిన సమయముకాదు. నీకు నచ్చకపోతే భోజన మారగించి, వెళ్ళి నిద్రపో!" అను బదులిచ్చాడు రావణుడు.

"అన్నా! దయచేసి కోపగించుకొనకుము. నా మనసుకు తట్టిన విషయమును చెప్పాను. నేను నీ కొరకు ప్రాణములు సహితం ఇవ్వడానికి సిద్ధమని నీకు తెలుసు. యుద్ధమున రామ, లక్ష్మణులను ఓడించిన పిదపనే నేను నీ వద్దకు తిరిగి వస్తాను. ఒకవేళ యుద్ధమున నేను మరణించినట్లైతే గనుక నీవు మన అసుర కులమును కాపాడుట కొరకైననూ సీతను రామునికి అప్పగించవలయును. నీవు, మన అసురకులము నాశనమగుట నాకు ఎంత మాత్రమూ ఇష్టంలేదు." అన్నాడు కుంభకర్ణుడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**ఏవం గురుపదం శ్రేష్ఠం దేవానామపి దుర్లభం**
**హాహా హూహూగణై శ్చైవ గంధర్వా ద్యైశ్చ పూజితమ్. 48**

**పదవిభాగము** :- ఏవం-గురుపదం-శ్రేష్ఠం-దేవానామపి-దుర్లభం-హాహా హూహూగణైశ్చ-ఏవ-గంధర్వాద్యైశ్చ-పూజితమ్,

**టీక** :- ఏవం=ఇంతవరకు చెప్పబడినట్లుగ; గురుపదం=గురువు అనే పదము; గురువు అనే పదవి; శ్రేష్ఠం = అత్యున్నతమైనది; అది హాహాహైహూహూగణైశ్చైవ=హా హా హూ హూ గణములకు గాని; గంధర్వాద్యైశ్చ= గంధర్వాదులకుగాని; దేవానామపి=దేవతలకు కూడ; దుర్లభము= పొందుటకు వీలుకానిది.

**వ్యాఖ్య** :- "ఈ విధంగా "గురువు" అనే మాట, గురువు అనే పదము (పదవి లేక స్థానము) అత్యుత్తమమైనవి. హా హా హూ హూ మొదలైన గంధర్వ గణాలకు గాని, ఇతర గంధర్వులకు గాని, దేవతలకు కూడ దుర్లభమైనది" అని గురు మహత్మ్యాన్ని వివరిస్తున్నాడు విశ్వేశ్వరుడు. హా హా హూ హూలు, తుంబురుడు మొదలైన వారు భగవంతున కిష్టమైన సంకీర్తనకార గణముల వారే గాక గంధర్వ, యక్ష రాక్షసాదులకు, దేవతలకు కూడ దుర్లభమైనది గురువు అనే పదవి. చతుర్ముఖ బ్రహ్మ అంతటివాడు "ఈ వ్రేపల్లెలో ఒక గురు భక్తుడైన గోపాలుని కాలిని అంటిన ధూళికణంగా పుట్టినా బాగుండును, ఏలా బ్రహ్మ పదంబు?" అని తనలో తానే ఆవేదన చెందుతాడు. కఠోపనిషత్తులో సాక్షాత్తు గురువైన యమధర్మరాజు "**మయా నచికేత శ్చితోగ్ని రనిత్యై ర్ద్రవ్యైః ప్రాప్తవా నస్మినిత్యమ్**" నీ వలెగాక అనిత్య ద్రవ్యముల యజ్ఞములందు వ్రేల్చి, ఆత్మ తత్త్వమును గోరక యమ పదమును పొందితిని గదా!" అని విచారిస్తాడు. మహాత్ముడైన శిష్యుని యౌన్నత్యమునకు ముగ్ధుడైన గురుదేవుడు "**త్వా దృఙ్ న్నో భూయా న్న చికేతః ప్రష్టా**" అని నీ వంటి శిష్యుడు మరొక్కడు మాకు

లభించుగాక అని స్తుతిచేస్తాడు అనగా సద్గురుదేవుని ఆశ్రయించిన సచ్ఛిష్యుని స్థితియే ఇంద్ర, యమ, బ్రహ్మాది పదముల కన్నా మిన్నయైనపుడు దేవ గంధర్వాది గణముల మాట చెప్పనేల?

**ధ్రువం తేషాం చ సర్వేషాం నాస్తి తత్త్వం గురోః పరమ్**

**గురో రారాధనం కుర్యాత్ సజీవత్వం నివేదయేత్. 49**

**<u>పదవిభాగము</u>** :-

ధ్రువం-తేషాంచ-సర్వేషాం-నాస్తి-తత్త్వం-గురోఃపరమ్-గురోః-ఆరాధనం కుర్యాత్-సజీవత్వం-నివేదయేత్.

**<u>టీక</u>** :- తేషాం సర్వేషాంచ=దేవమానవ గంధర్వాది సర్వజాతుల వారును; గురోః ఆరాధనం = శ్రీ గురుదేవుల ఆరాధనను; కుర్యాత్ = చేయవలెను; గురోః= గురువునకు; పరం=పరమై; ఇతరమైన; తత్త్వం= తత్త్వము; నాస్తి=లేదు, సజీవత్వం= నీ జీవితముతోగూడ; నీ జీవనాధారముతో కూడ, అనగా తను మన ధనములతో; నివేదయేత్=అర్పించుకొనవలెను.

**<u>వ్యాఖ్య</u>** :- "అందుచేత సర్వులును గురుదేవుని ఆరాధించి తను మన ధనములతో తమను తాము నివేదించుకొనవలెను, ఎందుకనగా గురువును మించిన వేరొక తత్త్వము లేదు" అని ఖండితంగా తన నిశ్చయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాడు పరమ శివుడు. బ్రహ్మమయుడు కావలెనను కోరు జీవుని లక్ష్యము నుండి దూరము చేయునవి మల, విక్షేప, ఆవరణ దోషములు. ఈ మూడు దోషములు పాప కర్మల వలనను, ఏకాగ్రత లేక పోవుట వలనను ఆచరణదోషము వలనను సంక్రమించినవి. గురు సేవయను సత్కర్మవలన మలదోషమును, గురూపాసన వలన విక్షేపదోషమును, గురూపదేశిత మహావాక్య శ్రవణము వలన జీవ బ్రహ్మైక్య సంధానముచే ఆవరణ దోషమును తొలగించు కొనవచ్చును. ఈ సాధనలకు సహకరించవలసినవి తను మన ధనములు, అందుచేత వానిని గురుదేవునికర్పణ చేసి శ్రద్ధావంతుడై తప్పక గురువును ఆరాధించవలెనని పరమ శివుడు విధించుచున్నాడు.

- సశేషం

(గత సంచిక తరువాయి) **గురుకృప** కీ.శే.- వై. లక్ష్మీనరసమ్మ

2013 సం.లో ఒకసారి జె.కె బాబు(ఎ.వి.రావుగారి మనువడు), కాళీ కుమారుడు బాబు కలిసి రాత్రి భోజనాల తర్వాత శ్రీబాబు లీలల గురించి మాట్లాడుకుంటూ, ఆయన భోదలు పునశ్చరణ చేసుకుంటూ మేడపై నిద్రపోయారు. కొంతసేపటికి వాళ్ల ప్రక్కనే ఎవరో మహిళ నడుస్తున్నట్టు గజ్జెల శబ్దం వినిపించింది. ఇద్దరూ లేచి చూస్తే అక్కడ ఎవరూ లేరు. అప్పటికే సమయం రాత్రి 2:30 కావస్తోంది, ఈ టైంలో ఎవరు వస్తారులే అనుకుంటూనే మళ్ళీ నిద్రలోకి వెళ్తుంటే ఆ గజ్జెల శబ్దం మళ్ళీ రావడం మొదలు పెట్టింది. జె.కె బాబు ఎంత చెప్తున్నా ఆగక సుబ్రహ్మణ్యం బాబు అక్కడ నుంచి భయంతో లేచి వెళ్ళిపోయాడు. ఉదయమయ్యాక ప్రభావతమ్మగారికి, ఫణిగారికి ఈ విషయం చెబితే "జగన్మాత రాత్రి పూట నగర సంచారం చేస్తూ వుంటుంది. అప్పుడప్పుడు ఆమె గజ్జెలశబ్దం, సుగంధ పరిమళాల వాసన వస్తూ వుంటాయి." అని చెప్పారు.

ఇంగ్లీషులో "Dreams are the language of God and it is a way for God to communicate with us" అనే ఒక నానుడి ఉంది. భగవంతుడు స్వప్న దర్శనం ద్వారా కూడా తన భక్తులను అనుగ్రహిస్తాడు అని దాని అర్థం. ఒకసారి శ్రీబాబు నరసమ్మగారితో "నేను వచ్చిన కల నిజం" అని అన్నారు. 2014 సం. లో మార్చినెల విశాఖపట్నంలో నరసమ్మగారి మనవడు బాబు 'లా' చదువుతున్నప్పుడు అతనికి మండపేటలో తాము ఇల్లు కట్టుకున్నట్టు, శ్రీబాబు ఆ ఇల్లంతా తిరిగి చూసి, కాఫీ తాగి "కాఫీ చాలా బాగుందమ్మ కాళీ" అని, అతనిని పిలిచి పాండురంగడిలా నుంచుని, "ఓరేయ్ బాబు! ఫోటో తీసుకుంటానన్నావు కదా తీసుకో" అని అన్నట్టు. కల వచ్చింది.

సరిగ్గా సంవత్సర కాలం తరువాత 2015లో మండపేటలో కట్టుకున్న ఇంటికి గృహప్రవేశం చేయించడానికి శ్రీఅమ్మ రావడం, ఇల్లు అంతా చూసి గురుపూజ చేయించి. "కొంచెం కాఫీ తీసుకొని వెడతాను" అని చెప్తే దేవిగారు (భీమవరం తాతయ్యగారి మనవరాలు) కాఫీ ఇస్తే "కాఫీ చాలా బాగుందమ్మ దేవి" అని శ్రీఅమ్మ అన్నారు. "అమ్మ నేను ఒక సెల్ఫీ తీసుకుంటాను" అని బాబు అడుగుతుండగానే "రారా తీసుకో"

అని అమ్మ అన్నారు. సంవత్సరం క్రితం బాబుకి స్వప్నలో కనిపించి ఎలా అయితే ఇంటికి వచ్చి, అంతా చూసి ఆశీర్వదించిన శ్రీబాబు నేడు శ్రీమాతాజీ రూపంలో వచ్చి వాళ్ళని ఆనందింపచేసి, గురు కృపను వర్షింపజేశారు. రూపం వేరైనా గురుతత్వం ఒకటేనని శ్రీఅమ్మ రూపంలో శ్రీబాబు ఈ రీతిన తెలియజేశారు.

వినేవారికి చిన్న విషయాలు అనిపించవచ్చు కానీ, అది అనుభవించే వారికి మాత్రం ఎంతో అనుభూతిని, ఆనందాన్ని కలుగజేస్తాయి. 2014 సం. లో కాళీకి తలలో సొరియాసిస్ వ్యాధి లాగా వచ్చి ఎన్ని ముందులు వాడిన తగ్గలేదు. ఆమెకు చిన్నతనం నుంచి ఏ బాధ వచ్చినా శ్రీబాబుతో చెప్పుకోవడం అలవాటు. ఒకరోజు బాధ మరీ తీవ్రమైతే కాళీ మనసులోనే శ్రీబాబుతో, "బాబు! ఈ బాధ ఇలా ఎన్నాళ్ళు పడను? కర్మ అనుభవించాలి అన్నా కూడా 3 సం. లుగా ఈ బాధ పడుతున్నాను. ఇక ఈ బాధ పడలేను, తగ్గించండి." అని ఆర్తితో ప్రార్థిస్తే, ఆర్తత్రాణపరాయణుడైన గురుదేవులు వినకుండా ఉంటారా?! ఆమె కొడుకుకి శ్రీబాబు కలలో కనిపించి తన తల్లి తలలో ఉన్న వ్యాధిని చేత్తో తీసి విసిరేసినట్లు కనిపించింది. తరువాత రెండు రోజులకి కాళీకి పూర్తిగా నయమైయింది.

భీమవరంలో ఒకసారి శ్రీబాబు నరసమ్మగారితో, "నీకు ఏ మంత్రోపదేశం అక్కర్లేదు, నిత్యం భగవన్నామ స్మరణ చేసుకో. అదే చాలు" అన్నారు. తన గురుదేవుల మాట శిరసావహిస్తూ ఆవిడ త్రిసంధ్యలలోనే కాకుండా, అస్తమానం శ్రీబాబు ఫోటో కేసి చూస్తూ "హరే రామ, హరే కృష్ణ..." అనే షోడశాక్షరీ మంత్రాన్ని జపం చేసుకుంటూ ఉండేవారు. ఏ జీవుడికైనా శరీరంతో అనుభవించాల్సిన ప్రారబ్ధం మాత్రం తప్పదు కదా. కానీ నరసమ్మగారికి మాత్రం శ్రీబాబు అలాంటివి ఏమీ లేకుండా ప్రాపంచిక దృష్టిని రహితం చేశారు. ఆవిడ గురు సాయుజ్యం చేరే వారం రోజల ముందు నుంచి ఆహారం ఏమీ తీసుకోక, కాఫీగానీ, నీళ్ళుగానీ తీసుకునేవారు. అవికూడా అందిస్తే మాత్రమే తీసుకునేవారు. కానీ, నోటితో మాత్రం ఆ వారం రోజులు, నిరంతరం "ఓం బాబు" అంటూ గురునామమే చేసుకుంటూ ఉండేవారు. అలాగే శ్రీబాబు నామ స్మరణతో తమ 84వ ఏట శ్రావణమాస శుద్ధ దశమి (13-8-2016) నాడు శ్రీబాబులో లయమయ్యారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## గుంటూరు భక్తులతో శ్రీబాబు

(గత సంచిక తరువాయి)

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

పాపాయమ్మగారికి, కాంతమ్మగారికి కూడా ఎక్కడ లేని మడి ఆచారము ఉండేది. శ్రీ బాబు వారింటికి రావటం మొదలు పెట్టిన కొంత కాలం వరకు , శ్రీ బాబు భోజనం చేసిన విస్తరిని వారితోనే తీయించి, భోజనం చేసిన చోట శుద్ధి పెట్టించే వారు. అక్కడ మళ్ళీ యింటివారు పసుపు నీళ్ళు చల్లి శుద్ధి పెట్టించేవారు. శ్రీ బాబు క్షౌరం చేయించుకుని స్నానం చేసి వచ్చాక, వారిపై శుద్ధి నీళ్ళు చల్లేవారు. క్షౌరం చేయించుకున్న చోట కూడా శుద్ధి చేసేవాళ్ళు. శ్రీ బాబు తమ బట్టలు తామే ఉతికి ఆరేసుకునే వారు. ఈ విషయాలన్నీ స్వయంగా పాపాయమ్మగారు చెప్పినవే.



ఒక ప్రక్క యీ పట్టింపులన్నీ యిలా ఉన్నా, శ్రీ బాబు అంటే మాత్రము వాళ్ళందరికీ ఎనలేని గౌరవము, భయభక్తులు ఉండేవి. శ్రీ బాబు మానవ జీవితపు విలువలను గుర్తింప జేసి ఆత్మవిద్యను అందించగల సమర్థ సద్గురువులని వారికి తెలియదు గాని యిక్కట్లన్నీ తొలగించి, యిమ్ములను చేకూర్చే యిలవేల్పుగా భావించేవారు. ఆ భక్తి ప్రపత్తులను గమనించటం చేతనే శ్రీ బాబు వారిలో మిగిలి ఉన్న అర్థం లేని ఆచారాలను అంతం చేసి వారిని ఉత్తమ భక్తులుగా తీర్చి దిద్దాలని కంకణం కట్టుకుని, ఆ కుంటుంబ యోగ క్షేమాలను తావే స్వీకరించారు.

పున్నయ్యగారి జ్యేష్ఠ కుమార్తె రుక్మాబాయిని కాంతమ్మగారి దత్తత కుమారుడు పాండుకు (పాండు రంగ శ్రీశైలరావు) యిచ్చి వివాహం జరిపించారు శ్రీ బాబు. ఆ విధంగా ఆ కుటుంబాలను మరింత సన్నిహితం చేశారు. 1952లో పాండుకు డబుల్ టైఫాయిడ్ జ్వరం వచ్చింది. సంధి వచ్చి కాళ్ళు చేతులు చల్లబడిపోయాయి. డాక్టర్లు లాభం లేదన్నారు. శ్రీ బాబు మాత్రం రుక్మాబాయితో "నీ మాంగళ్యం తిరుగులేనిది" అని అభయం యిచ్చి, ఆమెతో సావిత్రి, గౌరీదేవి వ్రతమును అనుష్ఠింప

చేశారు. ఆ రోజులలోనే శ్రీ బాబు ప్రతీరోజు గుంటూరు నుండి విజయవాడ నడిచి వెళ్ళి, కృష్ణానదీ తీరంలో ధ్యానం చేసుకునేవారు. ధ్యాన తీర్థమును పాండుకు, రుక్మాబాయికి యిచ్చేవారు.

ఆ విధంగా పాండుకు ప్రాణదానం చేసినప్పటినుంచి వుభయ కుటుంబాల వారు తమ్మతాము శ్రీ బాబు దివ్య చరణారవిందములకు అంకితం చేసుకున్నారు. శ్రీ బాబు రుక్మాబాయితో గోదీక్షలు చేయించి, నోములు నోయించిన ఫలితంగా నలుగురు స్త్రీ సంతానం కలిగారు. గుంటూరులో బ్రాడీపేటలో ఉన్న గృహంలో వాస్తు దోషములున్నాయని గమనించి, శ్రీ బాబు వాటిని సరిచేయించి, వారికి యిరువురు కుమారులను కూడా ప్రసాదించారు. ఆ తరువాత ఆ యింటి పైఅంతస్తు వేయించి మిగిలిన వాస్తు దోషములను సరిచేయించారు. ఆ అంతస్థులోనే శ్రీ బాబు గది ప్రత్యేకంగా శ్రీ బాబుకే కేటాయించబడి, అప్పటి నుండి ఇప్పటి వరకు అత్యంత శ్రద్ధా భక్తులతో శుభ్రంగా వుంచబడుతున్నది.

కాంతమ్మగారు, పాపాయమ్మగారు వారి కుటుంబాలతో అప్పటి నుంచి ఆ యింట్లోనే నివశించారు. పున్నయ్యగారి కుటంబం అరెండల్ పేటలోని తమ స్వంత యింటికి మారారు. 1961వ సంవత్సరం జనవరి 31 తేదీన పున్నయ్యగారింట్లో మాఘ పూర్ణిమ (వ్యాస పూర్ణిమ) సందర్భంగా సత్సంగ సమావేశము, శ్రీ సద్గురు పాదపూజ జరిగాయి. అప్పటి నుంచి వ్యాస పూర్ణిమలకే కాక ప్రతినెల పూర్ణిమ నాడు సమావేశాలు జరగటం ప్రారంభమైనాయి. మొదట్లో పున్నయ్యగారి ఇంట్లోను, 1965 నుంచి పాండుగారింట్లో యీ పూజలు జరిగాయి. పాదపూజలతో బాటు పెద్ద పెద్ద సమావేశాలు జరగటం, చాలా ఎక్కువ సంఖ్యలో భక్తులు రావటం అప్పటి నుంచి మొదలైనది.

శ్రీ బాబు ఎప్పుడు వారింటికి వచ్చినా, తమ దేవతార్చనను వారింట్లో ఉంచి, ప్రతిరోజు రెండు పూటల పూజ చేసి, తీర్థ ప్రసాదము లిచ్చేవారు. ఒక్కొక్కసారి శ్రీ బాబు తమ పూజా పీఠమును వారింట్లోనే ఉంచి గ్రామాంతరం వెళ్ళేవారు. ఆ సమయంలో దేవతార్చన సంచిని తెరవకుండానే దీపారాధన చేసి పుష్పాలు పైనే ఉంచి, ధూప దీప నైవేద్యాలతో పూజచేయటానికి రుక్మాబాయిని నియమించేవారు.

- సశేషం

# పూరి - కామాఖ్య యాత్ర

(గత సంచిక తరువాయి) - పాలూరి ప్రసాద్

ఇక పూరీ జగన్నాథ ఆలయంలో ఆ స్వామి రెండు చేతులూ చాచి ఆప్యాయంగా మనలను ఆహ్వానిస్తున్నా, అక్కడి విపరీతమైన రద్దీలో ముందు మనం ఊపిరితో బయటపడితే చాలన్న భావన ముప్పిరి గొంటుంది. ఒక్క పూరీ అలయంలోనే కాదు, యాత్రలోని అన్ని ప్రముఖ దేవాలయాలలో దాదాపుగా ఇదే పరిస్థితి. దేవుడు దయతలచినా పూజారి దయ తలిస్తే కానీ సవ్యంగా దర్శనం జరుగదు. "కోటికి పడగెత్తిన ధనవంతుడు నీ గుడి ముంగిట సామాన్యుడు, కూటికోసం శ్రమపడే నిర్భాగ్యుడు నీ కృపకెప్పుడు సమపాత్రుడు" అని పాడుకుంటాం కానీ ఆచరణలో మాత్రం పైసాలోనే పరమాత్మ.



మనవాళ్ళు దేవాలయ వ్యవస్థను ప్రభుత్వ ఆధ్వర్యం నుంచి తప్పించి ధర్మకర్తలకు అప్పజెప్పమని ఉద్యమిస్తూ ఉంటారు కానీ, పండాల ఆధ్వర్యంలో నడిచే ఉత్తరదేశ దేవాలయాల కంటే శుచి శుభ్రతల విషయంలో కానీ, నియమిత రూపంలో దర్శనాది సేవలను అందించడంలో కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మన దక్షిణాది దేవాలయాలే చాలా మెరుగు అనిపిస్తుంది. అక్కడ అంతా దైవాధీనం. నీకు సరైన పండా లభిస్తే చక్కగా దర్శనం అవుతుంది. లేకపోతే క్రొత్తవాళ్ళు, అమాయకులు తేలికగా మోసపోయే అవకాశం చాలా ఎక్కువ. బయట టిక్కెట్టు కొనుక్కుని వెళ్ళవలసి వచ్చినా ఒకసారి మూలవిరాట్టు ముందు నిలబడిన తరువాత అక్కడ ప్రశాంతత, భక్తిభావమే నిండిపోవాలి కానీ అక్కడ కూడా డబ్బులకోసం పీడిస్తూ ఉంటే ఇక భగవంతునిపై మనస్సు ఎలా నిలుస్తుంది?

అయితే ఇక్కడ కాదనలేని సత్యం ఏమిటంటే శ్రీగురుదేవుల అనుగ్రహం వలన మాకు దొరికిన పండాలందరు అక్కడి క్షేత్రాల గూర్చిన వివరాలన్నీ చక్కగా తెలియజేసి మాకు తృప్తిగా దర్శనం కల్పింపజేశారు. అయితే ఈ పరిస్థితికి పూర్తి భిన్నంగా పరమ ప్రశాంతంగా ఉన్న క్షేత్రాలు మాత్రం మాయాపూర్ ఇస్కాన్ దేవాలయం, దక్షిణేశ్వర్ కాళీమాత దేవాలయం, బేలూరు మఠం. అక్కడ అంతా పరిశుభ్రత, చిత్త ప్రశాంతతే కానీ విత్తం గురించిన ఆరాటం లేదు.

మీరు గమనిస్తే ఇవన్నీ గురువులతో ముడిపడిన క్షేత్రాలు. అందుకే దేవాలయంలో ఉన్న నిజమైన దేవుని దర్శించడం ఎలాగో, ఆరాధించడం ఎలాగో తెలియాలంటే కచ్చితంగా గురువు అవసరం అనేది. గురువు మార్గదర్శకత్వం లేనిచోట భగవంతుడు కూడా నీ ఉపాధికి తోడ్పడే వ్యాపార వస్తువే అవుతాడు.

ఇక మళ్ళీ పూరీ దేవాలయానికి వస్తే ప్రతిరోజూ సాయంకాలం ఎట్టి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా అక్కడి పూజారులు అంత ఎత్తైన ఆలయశిఖరం మీదకు ఎక్కి పతాకాలను మార్చడం చూసి తీరవలసిన అద్భుత దృశ్యం. అలాగే మన కాళీప్రసాద దేవుడిలాగే ఆ స్వామి కూడా నిరతాన్నదానపరుడు. ఇక ఆ జగన్నాధుని దర్శించడానికి ఆ స్వామియొక్క మరో రూపమైన సాక్షిగోపాలుడు బృందావనం నుండి పాదరక్షలు కూడా లేకుండా కాలినడకన తరలిరావడం ఒళ్ళు గగుర్పొడిచే అద్భుత చరితం.

జాజిపూర్ గిరిజాదేవి ఆలయం సతీదేవి నాభి పడిన శక్తిపీఠం. దీనినే నాభిగయ అని కూడా అంటారు. ఇక్కడి పూజారి శ్రీ మాతాజీ వారిని దర్శించడంతోనే తన ఉపాసన సార్ధకం అయినట్లు భావించి ఉప్పొంగిపోయాడు. అమ్మను వదలలేక మేము ఆ ఊరు విడిచిపెట్టేదాకా ఆమె వెంటనే తిరిగాడు. ప్రపంచంలోనే అతిపెద్దదైన పానవట్టంలో శివలింగం, విష్ణు సాలగ్రామం ఒకే రూపంగా వెలసిన లింగరాజ్ క్షేత్రం కూడా మన శిల్పకారుల అద్భుత నైపుణ్యానికి ప్రతీకయే.

శ్రీగురుదేవుల నిత్యపూజా మందిరంలో కొలువైఉన్న కలకత్తా కాళీమాతను దర్శించి ఆ తల్లి నాలుకను స్పృశించడం ఒక అనుభూతి అయితే శ్రీగురుదేవులు తమ సాధనకాలంలో ఎన్నో మార్లు, అలాగే ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల అనంతరం క్రమం తప్పకుండా వెళ్ళి దర్శించుకొనే దక్షిణేశ్వర్‌లోని భవతారిణి కాళీమాతను దర్శించడం, అక్కడ శ్రీ రామకృష్ణ పరమహంస వారి నివాస మందిరం, వారు తాము పొందుతున్న బ్రహ్మానందాన్ని అందుకోవడానికి రాబోయే శిష్యుల గురించి ఆరాటపడుతూ ఎదురుచూసిన మెట్ల మార్గాన్ని, శ్రీ వివేకానందులవారికి మంత్రదీక్షను ప్రసాదించిన సోపానాలను స్పృశించడం ఒక దివ్యానుభూతి.

ఇక శ్రీ పరమహంస వారు తమ అవతార పరిసమాప్తి చేయబోయేముందు కొద్ది మాసాలు నివసించిన కాసిపూర్ మఠంలో పొందిన అలౌకిక అనుభూతి మాటలలో చెప్పలేనిది. స్వామివారు, శారదా మాత, వారి సాంసారిక, సన్యాస శిష్యులు నివసించిన మందిరాలలో నెలకొన్న ప్రశాంతత వర్ణనాతీతం.

- సశేషం


విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# త్రైలింగ స్వామి

త్రైలింగస్వామి చేసిన లీలలు చాలా ఉన్నాయి. 1810లో ఉజ్జయినీ మహరాజు మణికర్ణికా ఘట్టంలో పడవ ప్రయాణం చేస్తున్నాడు. ఎదురుగా గంగా తరంగాలపై పద్మాసనస్థుడై తేలియాడుతున్న స్వామిని చూసి ఆశ్చర్యచకితులు కాగా, పడవలోని కొందరు స్వామివారి మహిమలు గురించి చెప్పగా, రాజు ఆయనను తన పడవలోకి ఆహ్వానించాడు. తన నడుముకి ఉన్న మణులతో పొదగబడిన కత్తిని చూసి స్వామి ముచ్చట పడితే రాజు తీసి ఇచ్చాడు. దానిని అటు ఇటు తిప్పి చూస్తుంటే అది గంగలో జారి పడింది. రాజుకి కోపం వచ్చి దుర్భాషలాడాడు. స్వామి తన చేతిని గంగలో ముంచి రెండు ఒకే తీరు కత్తులు తీసి తన కత్తి ఏదో గుర్తించమన్నాడు. రాజు గుర్తించలేక తబ్బిబ్బు పడుతుంటే "నీ కత్తిని గుర్తించలేని వాడవు ప్రజలను



ఏం గుర్తిస్తావు?" అని అసలు కత్తి రాజుకు ఇచ్చి రెండవదానిని గంగా నదిలోకి విసిరి వేశారు. రాజు క్షమాభిక్ష కోరాడు. స్వామి రాజుని కరుణించి గంగలోకి దూకి అదృశ్యులైనారు.

స్వామి నగర వీధులలో దిగంబరంగా తిరగటం గర్హించి కొందరు ఆంగ్లేయులు కాశీ మెజిస్ట్రేటుకు చెప్పారు. ఆ మెజిస్ట్రేటు కూడా ఆంగ్లేయుడే. స్వామిని పట్టి తెమ్మని పోలీసులకు ఆదేశం ఇచ్చాడు. పోలీసులు స్వామిని కొట్టి బలవంతంగా కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధీశుడు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పలేదు. స్వామిని ఎరిగిన సబ్ మెజిస్ట్రేటు, కొందరు ప్లీడర్లు స్వామి మహిమలు గురించి చెప్పారు. మెజిస్ట్రేటు అంతావిని తాను తినే మాంసాహారం తింటాడా? అని ప్రశ్నించాడు. స్వామి "అతను తినే మాంసాహారాన్ని నేను తింటాను. కాని తాను తినే ఆహారాన్ని మెజిస్ట్రేటు తింటారా?" అని సైగతో తెలియజేసి, బర్రుమనే శబ్దంతో తన చేతిలోనే మలవిసర్జన చేసి మెజిస్ట్రేటుకు చూపుతూ నోట్లో వేసుకున్నారు. ఆ దృశ్యం చూసిన మెజిస్ట్రేటుకు నోట మాట రాలేదు. ఐతే స్వామి మలవిసర్జనతో కోర్టు అంతా

సుగంధ పరిమళంతో నిండిపోయింది. స్వామి మహత్తును స్వయంగా చూసిన మెజిస్ట్రేటు త్రైలింగ స్వామి కాశీ పట్టణంలో స్వేచ్ఛగా తిరుగవచ్చునని, వారిని ఎవరూ అడ్డుపెట్టరాదని ఆజ్ఞాపించాడు.

1868లో రామకృష్ణ పరమహంస కాశీకి వచ్చి తన మేనల్లుడైన హృదయనాధ్‌తో స్వామిని దర్శించారు. స్వామి పరమహంసను తన ప్రక్కన కూర్చోబెట్టుకుని అతి మర్యాదగ పొడుం కాయను ఇచ్చారు. నిరీహులు, నిస్పృహులైన త్రైలింగస్వామిని హృదయనాధకు చూపి రామకృష్ణులు ఈయన "నడయాడే విశ్వనాధుడు" అని చెప్పారు.

మరొకసారి కాశీ వచ్చినప్పుడు రామకృష్ణులు అర్ధమణుగు పాయసం వండించి తీసుకు వెళ్ళి స్వహస్తాలతో త్రైలింగ స్వామికి తినిపించారు.

పరమహంస, స్వామిని ఈశ్వరుడు ఏకమా? అనేకమా? అని అడిగితే "సమాధి స్థితిలో ఏకమని, వ్యావహారిక జ్ఞాన స్థితిలో అనేకమని" సైగలతో చెప్పారు.

రామకృష్ణులు "ఇదియే నిజమైన పరమహంస స్థితి" అన్నారు. అద్భుతాలను, మహిమలను చేయని రామకృష్ణులు, త్రైలింగస్వామిని అంతగా గౌరవించారంటే వాటిని మించిన గొప్పతనం ఆయనలో ఉన్నదని గ్రహించారు. స్వామి తన గొప్పతనం చాటుకోటానికి చేసినవికావు, అవి ఆయన కారుణ్య భావానికి తార్కాణం.

- సశేషం

**16-9-2026 బుధవారం నుండి 20-9-2026 ఆదివారం వరకు**

**శ్రీకాళీవనాశ్రమ భాగ్యనగర శాఖలో**

**పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే!**

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## జూన్ 1 నుండి జులై 6 వరకు
## శ్రీ మాతాజీవారి అమెరికా యాత్ర దృశ్యములు



శ్రీ పంచముఖి హనుమాన్ మందిరం, డబ్లిన్





శ్రీ మధు, కాళీమాత వారి గృహంలో



అరియా యూనివర్సిటీ, మిల్పిటాస్ నందు లలితా సహస్రనామ పారాయణం

RNI No. : ENG/2007/20681

## జూన్ 1 నుండి జూలై 6 వరకు
## శ్రీ మాతాజీవారి అమెరికా యాత్ర దృశ్యములు



శ్రీ మాతాజీ బోధ,
సత్యనారాయణస్వామి వారి
మందిరం, మిల్పిటాస్



శ్రీ సత్యనారాయణస్వామి వారి
మందిరం,
మిల్పిటాస్



శ్రీమతి కురిచేటి
సునందగారి
నివాసమందు

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.